కథానిక :

# సుందరమ్మ అల్లుడు

శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

## 1

### రామం కథనం:

రాధకూ నాకూ చిన్నప్పుడే పెళ్లయింది. అదే తడవుగా మా నాన్న నన్ను వాళ్లపరం జేశాడు. అప్పణ్ణించీ వారింట్లో నే బ్రతికాను. అయితే చదువును చిన్నచూపు చూసిన వాణ్ణి కాదు గనుక ఆయేటి కాయేడు అడుగుముందుకు వేస్తూనే బి. ఏ. దాకా దేకాను. ఈ కాలంలో నా క్రింద ఖర్చైన డబ్బంతా—రాధ తల్లి—అంటే మా అత్తగారే—వాడేసేది.

అప్పట్లో వ్యక్తిత్వం అంటే ఏవిటో నాకు బొత్తుగా తెలియదనే చెప్పాలి. ఈ విషయమయ్యే అప్పుడప్పుడు నా మిత్రులు కొంత ఘాటుగా ప్రస్తావించినా, నే నంతగా పట్టించుకొనేవాడను కాదు. ఆ సంగతి చదువు పూర్తయి ఒక్కసారి జీవితంలోకి పర్యాలోకించిన తరువాతగాని నాకు పూర్తిగా ఆకలింపుకు రాలేదు.

ఆ క్షణంలోనే తెలిసికొన్నాను. ఈ యింట్లో రాధకున్న స్వాంత్ర్యంకూడా నాకులేదనీ, తల్లీ కూతుళ్లిద్దరూ కలసి నన్నొక కీలుబొమ్మగా తమ చేతులందుంచుకొని ఆడింపజూస్తున్నారనీను.

ఆర్థికస్వాతంత్ర్యంలేని వ్యక్తి ఎంత అధముడుగా పరిగణింపబడతాడో నాకు రోజులు గడచినకొలదీ నెమరుకు రాసాగింది. కాస్తో కూస్తో చదువుకొన్నవాడినేమో ... నాకు సందేహంగా తోచిన ప్రతి విషయాన్నిగురించీ తీవ్రంగా ఆలోచించడం మొదలెట్టాను. నాటినించీ నా మిత్రులు చేసిన హెచ్చరికలన్నీ వాస్తవానికి యెంతమాత్రమూ దూరంకావని లోతుగా అర్థంచేసుకొన్నాను.

రోజులు గడచినకొలదీ నా వైఖరిలో, నా ప్రవర్తనలో క్రమంగా మార్పులు రాసాగినై. అతి తీవ్రరూపంకూడా ధరించాయేమో...

ఇది గ్రహించిన తల్లీ కూతుళ్లిద్దరిలోను, ప్రారంభమైన గుసగుసలు తీవ్ర ఆలోచనారూపం అధిగమించి ఆచరణలో అడుగు పెట్టసాగినై. నేను అంటీ అంటనట్లు, ముట్టీముట్టనట్లే ప్రవర్తింపసాగాను.

ఘడియైనా ఆ కొంపలో స్తిమితంగా కూర్చొని ఆలోచించుకోవాలంటే నా చుట్టూ యేవో ఉక్కుతెరలు కమ్ముకొంటున్నట్లు దించుకుపోయేవాడిని. లేనిపోని పనులు కల్పించుకొని నేనక్కడున్న ఘడియలో నే కనీసం వందసార్లయినా తిరిగినట్లుండేది రాధ తల్లి.

ఆమె నా కళ్ల బడగానే వొళ్ళంతా కారం రాచుకొన్నట్లయేది. చూపులతోను సంజ్ఞలతోను వారించుదామని యెంత ప్రయిత్నించినా అదంతా వృథా అయిపోయేది. ఆ పాటి సూక్ష్మగ్రహణ శక్తి వారిద్దరిలో నెవ్వరికీ లేదు.

నేనాగదినుండి బైటపడి లక్ష్యం అంటూ వొకటిలేకుండా యే రైలుగోడ్డుకో పోయి ఒంటరిగా కూర్చొని యెంతకాలమో తల పగలగొట్టుకొనేవాడిని.

ఈవిధాన మూగబాధతో కొన్ని నెలలు గడిచాక పరిసరాలను పరిస్థితులను అర్థంచేసుకుని ఆకళింపుకు తెచ్చుకోవడం మొదలుపెట్టాను.

నాకు తెలిసినంతలో సైకాలజీని గురించి చాలా పుస్తకాలు తిరగవేసి చూశాను. అవసరం పట్టినప్పుడు కొన్ని కొన్ని విషయాలను సవిమర్శకంగానే చదివాను. అది వేటి ప్రభావమునైనా అనండి. నాలో పెద్దమార్పు వచ్చిందనిమాత్రం చెప్పగలను. నాకుగా నేను చెప్పుకోవాలంటే పుస్తకాలనించిగాక వాస్తవ ప్రపంచంనించే చాలా విషయాలు తెలుసుకోగల్గాను.

మధ్యమధ్య ఎవరేనా అనుకోవచ్చు; నా కింత కాలం రాధతో యెలా పొత్తుకుదిరింది? అని. నేనూ ఆ ప్రస్తావనలోకే దిగుతాను.

ఇంతవరకూ రాధతో నేనుకాని, ఆమె నాతో కాని మాట్లాడుకొని యెరగం. అంటే నేను పేరుకు గృహస్థును గాని నాదంతా నాతిగల బ్రహ్మచర్యం మాత్రమే.

అందుకే మాటామంతీ లేకపోయినా, నా గురించి చాటునా, మాటునా, తల్లితో గుసగుసలాడుతున్నదనే నాలో మరింత అహంభావం పెచ్చుపెరిగిపోయింది.

రాధవిషయంలో నాకు మరొక అనుమానం కూడా ఘాడగట్టింది: తను ఆ స్త్రీమీద అధికారం చలాయించినట్టు నామీదను స్వారిచేయడానికి తగిన ప్రాతిపదిక యీ గుసగుసల్లో యిమిడివున్నది, అని.

నేను గ్రహించినట్లే వాళ్ళూ పసిగట్టినట్లున్నారు. ఆ మరుక్షణంనించే వల పన్నడం ప్రారంభించేశారు. అది దారాలతో అల్లబడింది కాదు, అందులో ఉక్కుతీగల పనితనం యెంతైనా వున్నదని గ్రహించడానికి ఆట్టేకాలం పట్టలేదు నాకు.

ఇక్కడే మరో సంగతికూడా చెబుతాను. ఈ కలవరం ప్రారంభం కానంతవరకూ మా భావిజీవితాన్ని గురించి ఏవో బంగారు కలలు కంటూ వుండేవాడిని. రాధ నా సర్వస్వం, అనుకొన్నరోజులు నా జీవితంలో లెక్కకు తక్కువైనా కొన్ని లేకపోలేదు. అయితే ఇప్పుడు అప్పటి నాభావనా ప్రపంచమే లేదు.

ఏ విధమైన స్థైర్యమూ లేక పాదరసంలా పాకిపోయే మనసును సాత్క్యంగా యెన్నుకోవడం సమంజసం కాదేమో...ఒక్కమాటలో చెప్పాలంటే 'పరాధీనబుద్ధి' అనే మాట నాపట్ల నూటికి నూరుపాళ్ళు సత్యమే. స్వంతంగా ఆలోచించి వివేచన చేసుకోగలశక్తి యెప్పుడు లేదో మనసు వశంలో లేదనటానికిదే ప్రబల సాక్ష్యం.

ఒక్కమాట—కాకిగోల, కాకిమూక...అనే మాటలు మన తెలుగు భూమిలో అఖండ ప్రచారాన్ని ఆర్జించుకొన్నా యనుకుంటాను. ఒకడు సుఖంగా కాలక్షేపం చేస్తూంటే యెవ్వడికీ గిట్టదు. కవ్వంతో మజ్జిగ చిలికిన చందంగా యెక్కడో, యే మూలనో, యెవ్వడి హృదయమో కల్లోలితం చెయ్యాలని కొందరు నిరీక్షిస్తూ వుంటారు. వారందరికీ కలిసివచ్చేదీ, కూడివచ్చేదీ లేకపోయినా తమ కర్తవ్యాన్ని మట్టుకు యథావిధిగా నెరవేర్చుకోక మానరు.

వారందరిదీ వట్టి కాకిగోలగానే గుర్తించి వర్తించగల తాహతు ఎదటి వ్యక్తిలో లేనప్పుడు వారి ప్రభావం యెంతగానైనా ప్రసరించి తీరుతుంది. అది సక్రమమార్గంలోనా, వక్రమార్గంలోనా? అని వివేచన చేసుకోగల మనస్థైర్యం లేని నాబోటి కించిజ్ఞుడి భావనా ప్రపంచం చిలవలు పలవలు అల్లుకోలేదు ఇంకా. కల్లా కపటాలకు ఆట్టే స్థానంలేదు. కళ్లకు కనబడినదంతా యథార్థమే అనుకోగల అమాయకత్వం నాలో గూడు కట్టుకొనేవున్నది. దానికి తగినట్లు సాంప్రదాయికమైన విశ్వాసాలు కూడా ఆశ్వాసాంతంలో పడలేదు. జీవితసమస్యల విషయం అసలే అంతు చిక్కలేదు. బాధ్యత అనేదానికి అపరిచితుణ్ణే కనక యిది సహజమే ననుకొంటాను.

ఇలాంటి వ్యక్తావ్యక్తమైన అవస్థలోనే రాగోదయమైనదేమోనని నా అనుమానం. లేకపోతే రాధే నా సర్వస్వం, అనుకోగల్గినంత గాఢంగా నా గుండెల్లో యెలాటి భావమూ నాటుకుపోయేది కాదేమో...

కాలు జారిందల్లా నేనిక్కడే. లేకపోతే నా జీవితేతిహాసం మరో విధాన పరిణమించివుండేదేమో..

నాపైన నిఘా యెక్కువైందని లోగడనే విన్నవించుకొన్నాను కదూ? నేను వారికి చెయిదాటిపోయే పరిస్థితి యెప్పుడేర్పడిందో ఆ క్షణంలోనే వారొక తీర్మానానికి వచ్చివుంటారు. ఈ భారత భూమిలో అందరూ అనుకొన్నట్లుగానే వారూ నిర్ణయించుకొన్నారు.

ఒక్క విషయంమాత్రం నాకు ఆశ్చర్యాన్ని గొల్పుతూవుంటుంది "రాధ ఇంత సాహసం యెలా చేయగల్గిందా?" అని. కాని చివరకు సమాధానం దొరకకపోలేదు.

చిన్ననాటినించీ పెంచి పెద్దచేసిన వాతావరణానికి అందరిలాగే ఆమె కూడా దాసురాలయిందని, నాకు నేను చెప్పుకొనే సమాధానం. మున్ముందు నేనీ అభిప్రాయం మార్చుకొనే విషయంలో కాలం తీర్పుమీదనే ఆధారపడి వుంటాను.

తల్లి ఏపాటి విశాల దృక్పథం కలదైనా రాధ ఇలా తయారయివుండేది కాదేమో...ప్రస్తుతం వారి తాతలనాటినుంచీ వంశానుక్రమణికను ఏకరువు పెట్టి దాని స్వరూప స్వభావాల ఆద్యంతాలను వర్ణించి

వివరించా లనుకోవడంలేదు. సర్వసాధారణంగా అందరూ అనుకొన్నట్లే నేనూ భావించడంలో వైపరీత్యం యేమున్నది?

నాకుగల కొద్దిపాటి స్వాతంత్ర్యాన్ని హరించడానికే వా రుభయులూ ముంజేతులకు కంకణాలు బంధించకపోతే, ఆ తల్లి చెప్పడం, కూతురు ఆచరించి చూపడం—ఇదంతా వొక ప్రణాళిక జతపర్చుకొన్నట్లు జరిగేదికాదు—

జీవితం గడుస్తున్నకొలదీ అది అంతకంతకూ సుఖవంత మౌతుందనే ఆశ లేనినాడు, ఎవ్వడూ కలకాలం బ్రతకాలని కలలు కనలేడు. తనకు తానై బ్రతుకు విలువలను నిర్ణయించుకోనూ లేడు. ఈపాటి జిజ్ఞాస వారికి ఏకోశానా వుండదు; అందుకు అవకాశమూ లేదు.

ఏదో వొకవిధమైన అహంభావం వారిని మొదట్నించీ పట్టి పీడిస్తున్నదని నా విశ్వాసం. దానిని ఇతరులమీద కసి తీర్చుకోడానికి ప్రయోగించి సఫలత నందుకోగలిగిననాడే వారు జీవితంలో మహోదాత్త లక్ష్యాలు నెరవేర్చుకొన్నట్లు భావించగలరు. అప్పటి వాళ్ళ ఉత్సాహ కర ప్రవర్తనలుచూస్తే పూర్వాపరాలకు గల తేడాలు స్పష్టంగా కానవస్తూవుంజాయి. ఏపాటి ధైర్యసాహసాలతో ముందడుగు వేయగల్గుతున్నారో కూడా తెల్లమౌతుంది.

పైకి కనబడే యీ నూతనోత్తేజమంతా వాళ్లంతట వాళ్లే సృష్టించుకొని, పెంపుచేసుకొని తమమీదకు ఆవేశింప జేసికొన్నట్లు స్పష్టమౌతుందిగాని, ఎవటి వ్యక్తిని నూటికి నూరుపాళ్ళూ గుప్పెట్లో పెట్టుకొని ఆడించగల్గారా? అంటే అది అనుమానాస్పదమే. ఈ సంగతినే లోకం అర్థంచేసికొన్నట్లు వాళ్ళూ ఆకళించుకొంటే ఇంతటి శ్రమపడే ఆవశ్యకత ఉండేది కాదేమో...

వారే ఆవిధాన చేసివుంటే నే నిదంతా యెక్కణ్ణించి తవ్వుకొచ్చి వ్రాస్తాను? దీనితో నా కల నికి పనీ వొచ్చింది; నా జీవితానికి వెలుగూ చేకూరింది.

సర్వసాధారణంగా సంసారాల్లో జరిగే సంగతులన్నీ కాగితం యెక్కినప్పుడే కొత్తవిగా భాసిస్తాయి. కాని అందులో పడి మునగానాం, తేలానాం, అయేవాడికివి అంతగా ఆలోచనను చేకూర్చి పెట్టవు. ప్రస్తుతం నేనా అవస్థను అధిగమించా ననుకొనే యీ గోడంతా వెళ్ళబోసుకోవడం ప్రారంభించాను.

అనుభవించినవాణ్ణే నేను కనుక నన్ను నేను మర్చిపోయి కొంతకాలంపాటు మీతో కలిసి చదువుకొందా మనుకొంటున్నాను. ముందు వ్రాసి తర్వాతనే నాపని తప్పకుండా చేస్తాను.

జీవితానికి లక్ష్యాలు, ఆదర్శాలు అనేవి ఖచ్చితంగా యేర్పరుచుకోలేదు నే నింకా—కాని అజ్ఞాతమైన యేదో వొక మూగబాధ మటుకు నన్ను క్షణక్షణానికీ వేధించసాగింది.

సాధారణంగా అంటూవుంటారు...అభిమానం దెబ్బతిన్నది: అని. అలాటి దేదో నాలో జరిగిందనే అనుకుంటాను. పంతా లుడిగి ప్రకృతికి అతీతమైన భావనాపటిమను అలవర్చుకొన్నవాడను కాదు కనుక అనుక్షణానికీ యేదో బలవత్తరశక్తి కళ్లెంవేసి లాగుతున్నట్లు పెనుగులాడుతూ వుండేవాడిని. అయినా వొక్క విసురుకే విముక్తి సాధించగల నేర్పు, చాకచక్యం నాలో ఒక రూపానికంటూ రాలేదనే చెప్పాలి.

ఏకాంతంలో ఆలోచించుకుంటున్నా, అంతూ పంతూ లేని జనసందోహంలో చొచ్చుకుపోతున్నా, ఒక్కగానొక్క మాటమాత్రమే నా చెవుల్లో రింగ్, అని మ్రోగుచున్నట్లుండేది. అది యెవరు, ఏ సందర్భాన అన్నారో వివరించమని ప్రశ్న వేయకండి!

నా మెదడు అట్టి బలహీనతకు లోనైనదని మాత్రం చెప్పగలను. బహుశా వొకటి నిజమై వుంటుంది, మనసులోవుండే బలహీనతను మాత్రమే ఆధారంగాగొని యీ సువిశాల ప్రకృతిని కూడా ఆ విధానే అర్థం చేసుకొంటారనేది—అయినా దానికి బాధ్యుణ్ణి నేనుమాత్రం కాదు.

"కలో గంజో త్రాగి వాడి మానాన వాడు బ్రతుకుతున్నాడు. నిజంగా అల్లుడంటే సుందరమ్మ అల్లుణ్ణే చెప్పకోవాలి. ఎన్ని చదువులు చదివినా కొస్తంత గర్వం యెరగడు గందా. దారేపోయి దారే వచ్చేవారిలో యితగాడే మొదటివాడు" అని—

నన్నిలా లెక్కకట్టడంవలన వా రెంతటి ఘనకార్యం చేయగల్గామని అభినందించుకొన్నారో గాని నాకుమాత్రం ఆ మాటలు చెవులకు శూలాల్లా తగిలినయ్. నాలో యెట్టి మార్పూలేక ఉన్న పళానే యీ మాటలు వినివుంటే ఏమయ్యేదో ..కాని ఇప్పటి నేను అప్పటి వాడికంటే యెన్నో వందలమైళ్ళు ముందుకు ప్రయాణించాను.

లోకాపవాదును సహించి, కాకిని పొడిచినట్లు పొడుస్తున్నా "కుయ్ఁ..."అనకుండా అణగిమణగి ఒదిగి ఉండేటంత శాంతి, సహనం నాలో నశించినయ్యంటాను.

లోకం యేమనుకున్నా అది మంచి అయినా దానిని పెడమార్గాన అర్థం చేసుకోగల స్థాయికి నాలో అభిమానం రెచ్చిపోయింది.

"నే నెలాపోతే యెవడి క్కావాలి? నా విషయంలో వేలెట్టి చూపడానికి వీళ్ళకేం హక్కువుంది..." అనేటంత మంకుపట్టులో నేవుండి ఇతరులను అర్థంచేసుకో ప్రయత్నించాను—

ఇంతకీ నాలో రేగిన తుపాను కాలం రాపిడి కొంతమాత్రమూ తగ్గకపోగా మరింత విజృంభించింది. నన్ను గుప్పెట్లో పెట్టుకోడానికి వాళ్లు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి—

సహజమైన సాహచర్య ధర్మాన్ని అర్థం చేసుకోలేని వాళ్ళు ఒకరి నొకరు బానిసగా చేసుకోందామనే తహతహ లాడతారు. ప్రాథమికావస్థలో అది కొంత నిగూఢంగాను, లోపాయికారీగాను సాగినా యిద్దరిలో పైచేయిగా ఉన్న వాళ్ళు ఇట్టే పసిగట్టేయవచ్చు—కాని ఇటువంటి సంకట పరిస్థితుల్లో తెగిపోయిన తంతువును ముడిపెట్టడం మాత్రం సులభసాధ్యం కాదేమో...

అందులోనూ కొన్ని తరహాల అభిప్రాయవ్యక్తీకరణలున్నా ఉండవచ్చు, కాని, అవి సహజ మనస్తత్వ చిత్రణాన్ని దాటి ఊహాప్రపంచంలోకి పరుగులు తియ్యలేవు. అది అలా సాధ్యమైతే మనసులోని ఆవేదనలన్నీ మారురూపాలతో ప్రత్యక్షం కావడమనేది కొంతవరకూ సర్దుకుంటుందేమో...దానితో పాటు కొంత రభసా తగ్గుతుంది. కాని సహజంగా,—పారంపర్యంగా—సంక్రమించిన కొన్ని శక్తులవలన అది సాధ్యంకావడంలేదు. ఎన్నటికైనా కాగలదనే ఆశకూడా నాకులేదు సుమండీ! అలాగయితే అరవిందుడు కలలుగన్న ఆదర్శసంఘం సృష్టిఅయినట్లే-. జాతుల వైవిధ్యాన్నిబట్టి వారి ఆలోచనల క్రమం మారుతూ వుంటుంది. అయితే ప్రస్తుతం నా లక్ష్యంలో వున్నవి రెండే రెండు—స్త్రీ, పురుష జాతులు.

రాధ స్త్రీ కనుక ఆమె సహజంగానే నాకు బానిస అయి వుండాలనుకొన్నానంటారు!—ఒకవేళ ఏ వ్యక్తావ్యక్తంలోనైనా నాలో అలాంటి భావన పాటమరించివుంటే, అందుకు పూర్తిగా, రాధ, ఆమె తల్లిఅయిన సుందరమ్మ—ఇద్దరే బాధ్యురాండ్లంటాను. నాలో ఇలాంటి ఉద్రేకాన్ని రెచ్చగొట్టింది వారే కనుక.

వారి ప్రయత్నాలు, ఆలోచనలు ఎంత పరిమితంగా సరిపెట్టుకోందామనుకున్నా, నా మనసిక్కడ చైతన్యంగల కెమేరాలా పనిచేయడం ప్రారంభించాక మరెక్కడ దాగిఉండగలరు?

ఇదివరకే చెప్పాను—"నేను వారి ప్రవర్తనను అర్థంచేసుకో నే తీకలేదు" అని—ఆనాడు నా కెంతమాత్రమూ ఇష్టంలేదు రాధతో గానీ, వాళ్ల అమ్మతో గానీ మాటాడటం. కాని కవ్వించి అడుగుతుంటే మరీ మొండిగా విదిలించుకుపోవడం నాకే పౌరుషహీనంగా తోచింది. యథార్థం గ్రహించలేని లోకం నన్నే అపార్థం చేసుకొన్నా చేసుకోవచ్చు. ఇక్కడే నా కాలు పప్పులో పండిదేమో అని భయం. అదేమిటంటారా? ఖచ్చితంగా నేను ప్రకటించదల్చుకొన్న అభిప్రాయం ఆ రెండు జీవులముందరే కాకుండా, లోకంవేపుకే మళ్లించుకొంటే బాగుండేదేమో...

కంచంలో అన్నం పెట్టిన సుందరమ్మ రోజూలా నేతిగిన్నె నా దగ్గిరే పెట్టి ఏదో పనివున్నట్టుగా అవతలికి జారుకోలేదు. పైగా చేతబట్టుకొని తలుపు చాటుగా వొదిగి వొదిగి నిల్చున్నది. మొదటిముద్ద నోట్లో కెక్కాలన్నా నేతిబొట్టు పడకుండా జరిగే పని కాదు కనుక నేను అడగడమూ తప్పలేదు, ఆవిడ వడ్డించడమూ తప్పలేదు.

జాడీలోనుంచి సన్నగా ధారగా జారుతున్న నేతిలాగే ఆమె నోటినుండి ఒక మాటకూడా పెదవి జారింది; చాలా నిదానంగా, అర్థయుక్తంగా, నిర్మొహమాటంగా — "మీ నాన్నగారికి నేనే ఉత్తరం రాయిద్దామనుకుంటున్నాను వచ్చే దశమినాడో ఏకాదశినాడో బాగుంటుందంటున్నారు. ఆ మొక్కు కాస్తా తీరిపోతే అక్కడికి నా బాధ్యత మరేమీ వుండదు, మీరూ మీరూ... —అని మాట మధ్యలో వుండగానే "ఇక చాల్లే యీసొద" అన్నంత ఘాటుగా సకిలించి తల పైకెత్తి చూశాను.

సుందరమ్మ మొహం అప్పుడు స్పష్టంగా కనిపించింది నాకు. అంతవరకూ పరకాయించి చూసి ఉన్నవాణ్ణి కానందున అచ్చంగా కొత్తమొహంలాగే

వుంది. నాలో వస్తున్న భావపరివర్తనంవల్ల క్రమంగా ఆమెయెడలగల పూజ్యభావం కూడా నశించింది—ఎత్తైన కను గుబ్బలు, వెడల్పాటి చెక్కిళ్లు, పిల్లికి పాఠం నేర్పగల ఆ కళ్ళు నన్నొక్కసారి చలింపజేసినయ్. వెన్ను ఝల్లుమన్నట్టయింది—

ఇలా అంటూనే ఆమె క్రమంగా తలుపు పక్కకువెళ్ళి గోడకు చారగిలబడింది. కుచ్చెళ్ళు మాత్రం కొట్టొచ్చినట్లు కనబడుతున్నయ్.—చెప్పాను కాదూ? "వాళ్ళు అనే ప్రతిమాటకీ పెడర్థం తీయడం మొదలెట్టానని". అచ్చంగా అలాగే జరిగింది. నా సైకాలజీ పరిధికి అందినంతవరకూ తెలియవచ్చిందేవిటంటే—సుందరమ్మ మాట్లాడేమాటకు వెనక ఏదో గూఢార్థం యిమిడివున్నది. అని—

సమాధానం అందుకు భిన్నంగా యెలావస్తుంది? ఏదో చెబుదామనుకొన్నాను, అందుకు ఉద్యమించాను కూడా.

ఇంతలోనే "అమ్మా" అని పిల్చిన సవ్వడి వినబడిందినాకు. అది గొంతెత్తి పిల్చిన పిలుపుకాదు; గుసగుసలకు కాస్త హెచ్చు స్థాయిలో వున్నది. అయితే ఆ పిల్చినవ్యక్తి ఒకలా అనుకొనిఉంటుంది. ఆశబ్దం అమ్మను దాటి ఒక్క అంగుళం మేరైనా యివతలకు రాకూడదు, అని—కాని ఆమెకోరిక నెరవేరలేదు—

"ఒక్కసారి ఇలా రావే! అబ్బబ్బా! ఏం అడుగుతున్నావే—ఇటు రావే!"—ఎంత చనువు, స్వతంత్రంలేకపోతే యీతీరున తెగించి పిలవగల్గుతుందంటారు? అది ముమ్మాటికీ రాధే—

ఈ తీరున మల్లాగుల్లాలుపడుతూనే కొంత అన్నం నోట కొట్టుకొన్నాను. ఇంతలోనే సుందరమ్మ నేతిగిన్నె చెయి మార్చుకుని "వస్తున్నానుండు" అన్నట్లుగా మరొక చేతితో అదమాయించింది. రాధ కొంత తమాయించుకునుంటుంది. వెనక్కు వెళ్ళిపోయినట్లు అడుగుల చప్పుడు అస్పష్టంగా వినబడింది.

సుందరమ్మ నా సమాధానంకోసమే నిరీక్షిస్తున్నదని వేరుగా చెప్పనవసరంలేదు.—ఒక్క విషయం—నే నిదివరకు ఆవిడతోగాని, ఆమె నాతోగాని, యీ విషయమై సంప్రదించి వుండలేదుకదా, ఇంత ముక్తసరిగా,—వ్యవహారం ఆకళింపుజేసుకొన్నవాడిని అడిగినట్లుగా—అడిగి సమాధానంకోసం ప్రశ్నార్థకంగా నిరీక్షిస్తున్నదంటే అందులో అర్థం వున్నదంటారా?—

దీని కింతకీ పెద్దకారణం ఒకటేవున్నది. నాలో రేగిన తుపానును కొంతకు కొంతైనా వారు ఆకళించుకోవడం. దీనిమీద మరేవీ సరికొత్త పరిణామాలు రాకుండా అణచివెయ్యాలనుకోవడం—

"మీరు నూరుచెప్పండి, వెయ్యిచెప్పండి—నా పరిస్థితులన్నీ వొక తీరానికి రానిదే, అసలిక్కడ నా స్థానమేవిటో నిర్ణయం కానిదే—మీ రడిగిన దానికి సమాధానం చెప్పను; అట్టి తాహతుకూడా నాకు లేదు. ఒకవేళ మీరు సాహసించి నన్ను మెడలు విరిచి ఒప్పించుదామని తలపెట్టినా మీ రనుకొన్నది అనుకొన్నట్లుగా యెన్నడూ జరుగదు, అందుకు బాధ్యుణ్ణి నేనుకాదు."అనేశాను వ్యవహారం మాట్లాడుతున్న ధోరణిలోనే.

వెనువెంటనే సావిట్లోనించి యేదో పడినట్టు ఫెడీమన్న చప్పుడు వినబడింది. బహుశా నామాటలు విన్నరాధ ఏ కిటికీ రెక్కనో కసికొద్దీ బాది వుంటుంది.

సుందరమ్మకు ఇష్టం వున్నా లేకపోయినా తొందర తొందరగానే అన్నీ వడ్డించేసింది. నా భోజనంకూడా పూర్తయింది—

అది వొక్కటే కాదు; ఈవిధంగా జరిగిన రోజులు మరికొన్నికూడా వున్నయ్.

అర్థాంతరంగా వీళ్లలో కల్గిన యీ మార్పులను నేను గ్రహించిన పదహారణాల సత్యం ఇది—సుందరమ్మ పేరున ఉన్న ఆస్తి అంతా రెండు భాగాలుగా చెయ్యబడింది. ఒకవంతు తను యథేచ్ఛగా ఖర్చు చేసుకొనేట్లు వ్రాయించుకొని, మిగతాది రాధ పేరున వ్రాసి అట్టే పెట్టడానికి తీవ్రమైన ప్రయత్నాలుకూడా జరుగుతున్నయ్యని — ఇది నాకు లోకులు చెప్పినదేకాదు; ప్రత్యక్షంగాకూడా కొన్ని దాఖలాలవలన రుజువయ్యింది—

ఈ రాద్ధాంతాన్నంతనూ సక్రమమార్గంలో నడిపించి, విజయం చేపట్టగల వ్యక్తి రామచంద్రయ్య వొక్కడేనని నాకు తెలుసు. అందుకు తగినట్లు ఆయన కోర్టుపక్షీగా పేరు ప్రఖ్యాతులు గడించుకొన్నవాడే. కాకపోతే యీ యాగంధరాణమంతా కేవలం ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్వర్తించుకువస్తున్నాడా అనేది విచారణీయాంశం.

తరువాతనే మరొకవార్తకూడా చెవినిబడింది, సుందరమ్మ అద్యతనభావిలోనే రామేశ్వరయాత్రకు బయల్దేరబోతున్నదని, కొంతకాలం వ్యవహారాలన్నీ చక్కదిద్దుకొనే నెపంతో ఆమెకు మద్రాసులో మకాం పెట్టాలనే తలంపు కలదనీ—

అప్పుడు తెలిసింది నాకు. ఆ మొక్కు తీరితే తన బాధ్యత ఉండదన్న సుందరమ్మ మాటకు అర్థమేమిటో—

అమాత్రానికే అదిరిపాటు కూడదని నాలో నేను కొంతవరకూ తమాయించుకొన్నాను. నాకు తెలిసిన సత్యాలన్నీ ఆమెతో ముఖాముఖి యెలా ఏకరువు పెటడమా అనేది పెద్దచిక్కై వచ్చి పడింది. అయినా అదంతగా ఆటంకం కాలేదనుకోండి!—

మొండివాడు రాజుకన్నా బలవంతుడంటారు. ఆ న్యాయం అక్షరాలా నాయెడల వర్తించిందనే అంటాను. చావుకి పెడితే చివరకు లంకణాలకు దిగినట్టు, నా సంభాషణ అంత తీవ్రధోరణిలో సాగిపోబట్టి ఆ క్షణంలోనే నిరాటంకంగా సాగిపోవలసిన కొన్ని పనులు, వ్యవహారాలు దాదాపు నెలలు, సంవత్సరాలవరకూ వాయిదా పడిపోయినై.

కాగల కార్యమంతనీ నల్లేరుమీద బండీలా నడిపించుకుపోగల ననుకొన్న రామచంద్రయ్య కాలుగాలిన పిల్లిలా ఏమీ తోచక తిరగటం మొదలుపెట్టాడు.

సుందరమ్మలో చెప్పుకోదగిన మార్పేమీ రాకపోయినా నా విషయం ఆలోచించవలసి వొచ్చేసరికి కొంత సంకోచించడం మొదలెట్టినట్టు తోచింది.

రాధ మనసు మార్చుకొన్నట్టు నాకు వేరే నిదర్శనాలు దొరకలేదు కానీ, వోనాడు తల్లితో అంటున్న మాటలుమాత్రం ఏదో సందువాలీని వినగల్గాను.

"చచ్చినాసరే ఆయన్ని నువ్వు అడగొద్దు. ఎన్నాళ్ళిలా మొండిచరిచి కూర్చుంటారో చూదాం. మనమేనా యేమిటంత గతిమాలి పడివున్న వాళ్ళం? రోషాలు కావేషాలు అందరికీ వుంటయ్. ముష్టెత్తుకొనేవాడి పెళ్ళామయినా మాటలంటే పడదు. తిన్నయింటి వాసాలు లెక్కపెట్టినట్లు కావలసిన అన్ని పనులూ మన యింట్లో వుండి మన డబ్బు ఖర్చుచేయించి—పూర్తయిన తర్వాత తనకున్న అక్కస్సంతా మన మీదనే వెళ్ళగక్కాలా? నువ్వు, చచ్చినాసరే ఆయన్ని అడగొద్దు, ఏమైతేఅదవుతుంది." అని—

ఆనాడు నేను త్వరత్వరగా వెళ్ళి నా పెట్టెలో వున్న అర్జెంటు కాయితాలేవో తీసుకొని తిరిగి బజారుముఖం పట్టాను—

నేను వచ్చేసరికి రాత్రి యెనిమిదిగంటలు దాటివుంటుంది. ఇంట్లో యెవ్వరూ లేరు. తలుపు తాళం పెట్టివుంది. బహుశా ఏ సినిమాకో వెళ్ళివుండవచ్చు ననుకొన్నాను. అయినా వచ్చే సమయం దగ్గరపడింది కనుక వారికోసం నిరీక్షిస్తూనే ముందు వసారాలో ఇటూ—అటూ పచార్లు చేస్తున్నాను.

అంతకుముందే వొక మిత్రునితో పాటు హోటల్లో మస్తుగా వేసిరావడంవల్ల కడుపులో గడబిడ అంతగా సాగలేదు. మనసు ఏదో ఆలోచనలో, లేదా, జరిగిన దానిని నెమరు వేసుకొనడంలో నిమగ్నమయింది.

గతాన్ని గురించి తర్కించుకోవడం గాని ఆగతానాగతాలను ఏకముఖం చేసి సాకల్యంగా నిర్ణయాలు చేసుకోవడం గాని అంతకుముందు నా కాట్టే అలవాటై ఉండకపోవడంవల్ల ఇదేదో క్రొత్త పంథాలో దిగుతున్నామా? అనిపించింది. అయితే వొక తీరానికి చేరుకోక పోమనే ధీమాతోనే ప్రారంభించడం జరిగింది కనుక ఆట్టే కలవరపాటుకు అవసరం లేకపోయింది—

నే నిదివరకే చెప్పుకొన్నానుగా: "బి. ఏ. దాకా ఢేకిన' అనుభవహీనుణ్ణ"ని. ఆనాటినించే మిత్రులు కొందరు వెంటబడి వేపుకుతినడం మొదలుపెట్టారు. 'తమతోపాటు ఏ హైస్కూలులోనైనా చేరి నాలుగుడబ్బులు కళ్ళజూస్తే కాఫీ ఖర్చుకన్నా స్వంతం అంటూ జేబులో ఏడుస్తుంద'ని. కాని అప్పట్లో నా కవ్వేవీ చెవికెక్కలేదు. పై పెచ్చు వార్లనందరినీ కాలానికి బానిసలైన పిరికిపందలుగా జమకట్టేశాను. అయితే వాళ్లు నన్ను ఊదరబెట్టడం మాత్రం మానలేదు. దాని ఫలితమే నేడు నాలో కలిగిన పరివర్తనము. దీని పర్యవసానమే యీనాడు హైస్కూలు హెడ్‌మాష్టరుకు అప్లికేషను వ్రాసుకొనివెళ్లి యివ్వడము. ఇందాక అర్జంటు అని చెప్పిన కాయితాల వ్యవహారం యిదే—

దీనిమూలాన నా నైతికజీవితంలోనే కాకుండా ఆర్థికజీవనంలో కూడా చెప్పుకోదగిన మార్పు సంభవిస్తుందన్న మాట!

ఇంక రెండుమూడు రోజుల్లో సుందరమ్మ చేతి కింద కూడుతినే అవస్థకూడా అంతమౌతుంది. అందుకని వేరే వొక గది తీసుకొని బిఛాణా బదలాయించాలన్నమాట! ఆ యేర్పాట్లన్నీ వాడే చేస్తానన్నాడు. అయినా మనం మాత్రం యెందుకు జోక్యం కల్పించుకోకూడదు?

అదేదో ఏడుగొందుల సందులో వొక గది తీసుకొని నన్నక్కడ కుమిలి ఏడవమంటే నేను చావలేను. నల్లుల్లాగ, దోమల్లాగ, చీడపురుగుల్లాగ—ఆ చీకటి గొందుల్లో పడివుండడం నా చేతకాదు—నేనిప్పుడు వెలుగును కోరుతున్నాను. వాసయోగ్యంగా వుండే యేదో వొక మేడమీద—అది వంకరటింకర మేడకాకుండా ఉండాలి—పై అంతస్తులో గది తీసుకోవాలి—ఎలక్ట్రిసిటీ ఎలాగూ వుంటుంది కనుక రేడియో విషయం ఆలోచించాలి. అదేదో వారినే యేర్పాటు చేయమని నెలకింత చెల్లించే పద్ధతిమీద ఖరారుగా వ్రాసియిస్తే సరిపోతుందేమో...హైస్కూలులో చేరిన నాకు ఆమాత్రం స్వేచ్ఛావాయువులు పీల్చుకొనే అవకాశం లేకపోతే యెలా?—

అయితే వొకటే వొక ప్రధానసమస్య మిగిలిపోయింది. అది నా సాంసారిక జీవితం గురించి. దీనిని తర్కించుకున్నకొలదీ ఇదివొక అగాధంగా పరిణమించే సూచనలు కనబడుతున్నయ్. క్రమంగా నన్ను అంతర్లీనం చేసుకొన్నా అడిగగల తాహతు అరువు తెచ్చుకోవాలి. అందుకు తగిన శక్తిస్తోమతలు చేకూరేవరకూ ఆమాటే తలపెట్టకూడదు. ఈలోగా వాళ్ళల్లో కూడా కొంతమార్పు రావచ్చును. నన్నుగురించి యింతవరకున్న అభిప్రాయాలను మార్చుకోవచ్చును. ఏమైనా నేనిక్కడ వుండేది ఇక రెండురోజులు మాత్రమే. అంతటితో యీ జీవితానికి భరతవాక్యం పలుకవచ్చు—

తపీమని వాకిలిముందరే జట్కా వచ్చి ఆగింది. నేనల్లుకొంటున్న ఆలోచనల త్రాడు పుటుక్కుమన్నది—సుందరమ్మ, కూతురూ ఇంట్లో ప్రవేశించారు. కొంతసేపటికి యథారీతిగా నా భోజనం ముగించుకొని గదిలోకి వచ్చేశాను—

రెండురోజులు ఇట్టే గడిచిపోయినై. మూడో నాటి మధ్యాహ్నమే నన్ను వెతుక్కుంటూ వచ్చింది హైస్కూలువారిచ్చిన అప్పాయింట్‌మెంట్ ఆర్డర్.

అరగంటలో నా పెట్టె బేడా సర్దుకొని సుందరమ్మతో ముక్తసరిగా చెప్పి అంతకు పూర్వమే నా అభిరుచుల ప్రకారం మిత్రుడు కుదిర్చిన మేడమీది గదిలో చేరాను!

## 2

## సుందరమ్మ చెప్పింది:

నాకూ వేరే మగదిక్కెవరూ లేరుకదా కొత్త చేదోడు వాదోడుగా వుండి నా వ్యవహారాలు చక్కబెట్టకపోతాడా? అని నమ్మికొనే అతణ్ణి యింట్లో పెట్టుకుని చదువుసంధ్యలు చెప్పించి పైకి తీసుకురావాలనుకున్నాను.

ఆ వుద్దేశ్యంతోనే మొట్టమొదట కామయ్య అన్నగార్ని అడిగించాను. ఆయనా అందుకు కాదనలేదు.

నిజానికి కల్లాకపటం యెరుగని ధర్మరాజులాంటివాడంటే కామయ్యగారినే చెప్పుకోవాలి. వాళ్ళ సంసారం చాలా పొందికైనది; సంప్రదాయం చూదామా యెటూ కూడా మచ్చలేనిది. పిల్లలు బహుకుదురైనవాళ్ళు—ఇవన్నీ జాగ్రత్తగా విచారించుకొనే సంబంధం ఖాయం చేసుకొన్నాను.

నా మనసులో మాట బైటపెట్టిన తరవాత ఆయనా అందుకు కాదనలేదు. లాంఛనాలూ అవీ సక్రమంగానే జరిపించాను. నేను మటుకు నా చేతిమీదుగా మరే శుభకార్యం చేయించబోతున్నాను కనక—ఒకళ్ళ చేత అనిపించుకోకుండానే మా రాధ వివాహం చేశాను.

రామం మా యింటికి వచ్చేశాడు. ఇన్నాళ్ళనించీ నేనేం పెడుతున్నానో......అతనేం తింటున్నాడో మూడో కంటికి తెలియకుండానే కాలం గడిచిపోసాగింది. ఒక్కనాడొక్కటి కావాలని పల్లెత్తి అడిగి యెరగడు. అతని దసలు ఏ విషయానికీ బైటపడే స్వభావం కానేకాదు. అందరూ అంటూ వుండేవాళ్ళు కూడా—'నోట్లో నాలుకే లేదేమమ్మా మీ అల్లుడికి?' అని. చాటుసైనా నిజం చెప్పుకోవాలి!—

ఇన్నాళ్ళూ నాదగ్గరలా ఉండడంవల్లనే ఆడకూతుర్నయినా అన్ని వ్యవహారాలూ నిభాయించుకురాగలిగాను. మొదణ్ణించీ, యతి అంటే ప్రతి, అనేవాడే అయితే ఒక్క రోజైనా నాకు గడిచేదంటారా?

ఫస్టు తారీఖు రాగానే అతనికి కావలసిన డబ్బంతా వొక్కసారే గదిలో డ్రాయర్లో పెట్టేసే దానిని. అత దెందు కుపయోగించుకొనేవాడో... ఏమేం అవసరాలకు వాడుకొనేవాడో నాకేం యెరుక?

అప్పుడప్పుడు అంటూవుండేదాన్నికూడా— 'నీకేమైనా అవసరమైతే అడుగు నాయినా, ఇందులో కొత్తవాళ్లెవరున్నారు?' అని—

అన్నిటికీ అతను ముభావంగానే వూరుకొనేవాడు. శాస్త్రం చెప్పినట్టు అదికూడా అంగీకారమే కావున్ను అనుకొనేదానిని—ఎప్పుడన్నా పండగా పరపంవస్తే రాధకు చీరా జాకెట్టు కొన్నప్పుడు 'ఆయనకుమాత్రం వద్దా?' అన్నట్టు గునుస్తూ వుండేది. ఒకటి రెండుసార్లు నేనే అతనికి చేతులో పెట్టబోయాను. కావలసిన లాగులు, చొక్కాలు కొనుక్కొమని. ఒకసారి నేనిచ్చినదాంట్లో సగం మాత్రమే తీసుకొన్నాడు — మరోకసారి అసలే అక్కర్లేదన్నాడు. నేనుమాత్రం యేంచేయగలను? అంతటితో వూరుకొన్నాను—

ఈయింటికి సంబంధించినంతవరకు అత నంతకంటే జోక్యం కల్గించుకొనేవాడు కాడు కనుక, మా వ్యవహారా లతనికెప్పుడూ తెలియజెయ్యలేదు. నాకా తలంపుకూడా వుండేది కాదు.

అయితే నన్ను మరోకలా అర్థం చేసుకోరను కొంటాను. ఎందుకంటే అతని మనస్సు ఇంకా అంత పరిపక్వమూ కాలేదు. చదువుకొనే కుర్రవాడిముం దివన్నీ యేకరువుపెడితే చదువుకు భంగం కలుగుతుంది. ఇవన్నీ ఆలోచించేటందుకు తగినతీరికా అతని కుండదనే వుద్దేశ్యంతోనే ఏవీ చెప్పక పోయాను.

ఇదంతా యెన్నటికైనా వాళ్ళు అనుభవించేదే కదా, ఇవాళ కాకపోతే రేపైనా తెలుసుకోక పోతారా అనే ధీమాతోకూడా వూరుకొన్నాను—

ఈవిషయాలు కొన్ని రాధకు తెలుసు. అందుకై నేను తీసుకొన్న శ్రద్ధ ఏవీ లేదు. నేను వెళ్ళినచోటికల్లా వస్తూవుండడంవలన, నాతోపాటే కొన్ని కాయితాలు అదీ చూస్తూవుండడంవలన చెప్పకుండానే కొన్ని వ్యవహారాలు దానికి తెలిసినయ్. ఈసంగతులు మాట్లాడుకొంటున్నప్పుడు మాటకుమాట అడ్డువేస్తూ వుండేది.

దాని విషయంలో నేను చేసిన లోపమల్లా వొక్కటే — స్కూలు ఫైనలు దాటి చదివించక పోవడం—దానికీ యిష్టం లేకపోయింది, నేనూ అంతగా పట్టించుకోలేదు.

ఆలోచించగా ఆస్తికంతకీ అదే యజమానురాలు కాబోతుందికనక ఇదంతా నిర్వహించుకోవడం యెలాగూ తప్పదు. దానికీ చదువు చాలదా అనిపించింది అప్పట్లో—రామం పట్టుపడతాడేమో అనుకొన్నాను. కాని దాని చదువు విషయంలో అతనూ పట్టించుకోలేదు.

ఉన్నదాంతో దేనికీ లోపంలేకుండానే సంసారం గడుపుకొనేవాళ్లం—నాకు మధ్య మధ్య అనిపిస్తూవుండేది; 'దక్షతలేని యీ కొంపలో యెవరడుగుబెడతారా? వాళ్లు మనకు అండగా నిలుస్తారా?' అని. కాని రామం ఇంటికి వచ్చింతరువాత మనసు కొంత స్తిమితపడ్డట్టయింది. అతను బి, ఏ. పరీక్ష అయ్యేదాకా అదే అభిప్రాయంలో వున్నాను నేను. మార్చుకోవలసిన అవసరం కలగలేదు—. పెద్ద పరీక్ష అయిపోతే ఆ మొక్కు కాస్తా తీరిపోతుంది. ఇక నన్నీ అతనికే క్రమంగా తెలిసివస్తయ్ అనుకొన్నాను.—కాని తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు ఆ మొన్నాటినించే అతనిలో మార్పు కనబడసాగింది—క్రమక్రమంగా మారిపోయాడు. ఆ సంగతి తనంతట తాను ప్రస్తావించకపోయినా ఇతర్ల వలన చాలా తెలుసుకొన్నాం—

కాని వాళ్ల సంసారం ఏనాటికైనా కుదటబడ గలదనే ఆశతోనే నేను తలపెట్టిన ప్రయత్నాలన్నీ అతను భగ్నంచేశాడు—బిళ్లబీటుగా వచ్చిన యీ మార్పు జూసిన యెవరికి అనుమానం కలగదో చెప్పండి!—ఈ సంసారం యెలా దిద్దుకోవాలో తనకు తోచిన అభిప్రాయాన్ని నాయెదట వెల్లడించ లేదు—

చెబితే చేయగలదాన్నే కాని లేకపోతే వెంటబడి వేపుకుతింటానా? ఇన్నాళ్ళనించీ వుంటున్న వాడికి ఆమాత్రం చెప్పి చేయించుకోగల స్వతంత్రం లేదూ? ఎంతవరకూ అని అడకూతురు బయటపడుతుంది?

ఈ కొంపమీద యెందుకనో అతని కలాటి ముభావం యేర్పడింది. ఆ సంగతి భగవంతుడికే తెలియాలి.

ఎంతోకాలం ఓపికపట్టాను. దీనికంతకూ కారణం యేమిటో నేనంతగా గాలించలేదు. నాకు నేనై మరెవర్నీ అడిగి తెలుసుకోవాలనే తలంపు కూడా లేదు—మనయింట్లో మనిషినిగురించి యితర్లను వివరాలు చెప్పమంటే కాపరం రచ్చకెక్కినట్టేనా మరేమన్నా వుందా?

అప్పట్లో మా సంసారంగురించి యితర్లకున్న అభిప్రాయాలనుబట్టి చూసుకొన్నా అటువంటి ప్రయత్నంవల్ల మనకే చేటు మూడుతుందని వెనక్కు తగ్గి వూరుకొన్నాను.

ఒక్క రామం విషయంలోనే కాకుండా మరెన్నిటి గురించో యిలా నోరు నొక్కుకున్నాను—కొన్నాళ్ళవరకూ నన్నొకటే వొక మొండినమ్మకం ఏడిపిస్తూ వుండేది. ఇతనింతవరకూ మన చెప్పు చేతల్లోనే మెలగినవాడు కదా, అసలు సంగతేమిటో చెప్పక ఇట్టే చెయిదాటి పోతాడా, అని. కాని అందుకతను సిద్ధంకాలేదు; అంతకంతకూ నాలో అనుమానాలుకూడా బలపడసాగినై—

సాధ్యమైనంత ప్రయత్నం చెరపైనా అతనివద్ద నుంచి కొంతకుకొంత సమాధానం రాబట్టాలని మేము—ముఖ్యంగా నేనే—చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయిపోవడంతో నసాళం అంటుకుంది; అదే నాలో పెద్దమార్పు రావడానికి కూడా కారణం అయిందనుకుంటాను.

ఇక్కడే వొక్క మాట కూడా అంటాను—రాధను నేనెంతో దూరంగానే అట్టేపెడుతూవుండేదానిని యీ విషయాలనుంచి. నిజానికి వాళ్ళకేం తెలుస్తయ్ యీ క్షోభలన్నీ? ఆ పసి మనసులో అనవసరంగా కలవరపాటు కల్గించడం నాకిష్టంలేకనే అలా చేశాను—

ఒక్కొకసారి దీనినంతనూ ఆలోచించుకొంటూ కుప్పలా కూలబడిపోతూవుండేదానిని; గంటలకు గంటలు ఆలోచనల్లో మునిగిపొయ్యేదానిని. అటువంటప్పుడు రాధ వచ్చి నాపక్కనే కూర్చుని మారాం చేసి అడుగుతూ వుండేది. ఏమీ లేదన్నట్టు అంతా కప్పిపుచ్చి, మటుమాయం చెయ్యాలనుకొనేదానిని. వెనక చెప్పిన కారణంచేతనే దానికి ఆనూ, పానూ తెలయనిచ్చేదానను కాదు.

అయితేమాత్రం బొత్తుగా గ్రాహికం తెలీని పిల్ల కాదాయె! దాని మనసు కేంతోచేదో...... చివాల్న అక్కణ్ణించి లేచిపోయి ఎంతోసేపు గదిలో కూర్చొని వుండేది. ఒకనాడు దిండులో తల పెట్టుకుని ఏడవడంకూడా నా కళ్ళారా చూశాను.

మేమిద్దరం లోపల్లోపల ఇంతగా కుమిలిపోతున్నా అతను ఒకనాడైనా 'ఇదేమిట'ని నోరుచేసుకు అడగలేదు. బొత్తుగా తెలియదంటానికీ వీలులేదు. ఇన్నేళ్ళుగా ఇక్కడ పడివున్నవాడికి మా సంగతీ, స్వభావము తెలియదూ? అలాంటప్పుడు ఒకళ్ళే బాధపడడం మరొకళ్ళు బెల్లం కొట్టినరాయిలా అన్నీ చూస్తూ హర్షించి వూరుకోవడం అదెంత అసహజంగా వున్నదో ఆలోచించండి!

ఇదంతా మా ప్రయోజనంకోసమూ, మా లాభాలకోసమే జరుగుతున్నదా? లేక మాకు గలిగిని సత్ప్రయోజనంలో అతనికి కూడా పాలు ఉన్నదంటారా?

మరంతటి వివేకం సంపాదించుకొన్నవాడు, అసలేమీ సంబంధం లేనట్లు—'నన్ను ముట్టుకోకు నా మాలకాకీ' అన్నట్టు వూరుకొంటే అవతలివాళ్ళెంతకాలమని ఓపిక పట్టగలరు? ఒకవేళ వారికుండే అవసరాల్ని బట్టి అది సంభవమే అనుకొన్నా లోకం దృష్టిలోనన్నా మనసు మార్చుకోక తప్పుతుందా?

అసలీ లాభాలు, ప్రయోజనాల సంగతి కేవలం మాకోసమే పుట్టింది కాదు; మా వొకళ్ళ మొహానే వ్రాసి పెట్టలేదు. ఆదికాలంలో సంబంధం కోసం వెళ్ళినప్పుడే అనంతయ్యగారితో అన్నాడట కామయ్యగారు. 'మా సంసారం స్థితిగతులు తెలిసినవాడవే కనుక ఇంతకంటే పై చదువులు మేమెలాగూ చదివించలేం; ఆ కొరత తీర్చుతానని ఆవిడ అంగీకరించి మీద్వారా కబురంపింది కనక నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను; అయినా అబ్బాయిని కనుక్కు చూడండి!' అని—అతనూ అందుకు అభ్యంతరం చెప్పలేదు. మరిన్నాళ్ళనించీ మాతోపాటు కల్లో, గంజో తాగి పడివుండలా? ఎటొచ్చీ యీమధ్యనేగా యీ అవాంతరం వచ్చిపడింది?

దేనికైనా సిద్ధంకాగల తాహతు, వెనకే హంగూ వున్నవాళ్ళమైతే ఇదేమిటో తాడో పేడో తేల్చుకొనేదానిని. 'ఏ విషయం పైకివచ్చినా బయటపడేది మనమేకదా.' అనే బెరుకులో కాలం వెళ్ళదీసుకు రాబట్టే అతనంతవరకూ బిర్ర బిగిశాడు.

ప్రాణం విసుగు చెందింది, నాకూ, నాతోపాటు రాధకుకూడా. ఇద్దర్నీ పెనుభూతంలాపట్టి

బాధిస్తున్న దొక్కటే అనుమానం — "ఇతను తనకు తానై యింతగా మారిపోయి వుండడు; వెనకాలెవరో పురెక్కించేవా రున్నారు" అనేది—పోనుపోను ఇదే మా మనసుల్లో బలంగా నాటుకుపోయింది.

సాధారణంగా మనుషులలో వుండే బలహీనత వల్ల దానికే చిలవలూ, పల్లవలూ అల్లుకోవడం మొదలు పెట్టాం. ఈ వ్యవహారంలో అవునని కానీ, కాదని కానీ ఆలోచనలు అందించేందుకు మరెవ్వరూ లేరు.

రాధతో నేనూ, నాతో అదీ—యిద్దరమూ మనసువిప్పి మాట్లాడుకో నేవాళ్ళం—అతనికి అన్నం పెట్టిపంపిన తరువాత ఆ యింట్లో మే మిద్దరమే. ఎప్పుడో కాని ఇంకొకరు వచ్చేవారు కాదు. ఆ ఖాళీ సమయంలో మా యిష్టానుసారం యెన్నెన్నో నిర్ణయాలు చేసుకో నేవాళ్లం. ఏమైనా సరే మనం తగ్గి రాకూడ దన్నంతటి మంకుపట్టులో వుండేవాళ్లం.

అయినా నేనే ఇంత కచ్చగా కయ్యానికి కాలుదువ్వితే నా బిడ్డసంసారం యేమౌతుందా! అని విచారపడుతూ వుండేదానిని—'ఇదేం గ్రహచారం వచ్చిపడిందిరా దేవుడా' అని లోపల్లోపల కుళ్లి పైకి తేటగా కనబడాలని ప్రయత్నించే దానిని.

అప్పటికి మా యింట్లో మనోవ్యథలు బైటి ప్రపంచానికి కొద్దిగా మాత్రమే తెలుసు—రామం సంగతి మొదణ్ణించీ యెరిగున్న వారు అంత తొందరగా అభిప్రాయాలు మార్చుకోరుగా? కాని యీ నాల్గు గోడలమధ్యా యెంతటి పొగ రాజుకుంటూందో పొద్దస్తమానమూ కళ్లు కాయలు కాచే మా యిద్దరికి మాత్రమే తెలుసు.

అసలు మా అనుమానానికి మూలమేమిటో ఇంతకుముందే కొద్దిగా తెలిపాను. అంతకంటే పెను భూతమై పట్టి పీడించేది మరొకటికూడా వున్నది; అది యిది—. "ఇతని వెనక యెవరో వుండి ఆడించడమే కాదు; ఇతనే యెవర్తె వలలోనో పడి వదిలించుకో లేక, ఇక్కడ మాకు తగిన సమాధానమూ చెప్పలేక యీ విధాన మొదలు పెట్టాడు"—అని

ఈ అనుమానం నాలోమాత్రమే కలిగిందనుకున్నాను మొదట. రాధకు తెలియనీకూడదనుకున్నాను. కాని...—నాకంటె ముందుగా అదే పసిగట్టిందట! ఒకనాడు పనివేళా వచ్చి నాతో చెప్పేదాకా తెలియదు—

అప్పుడు నా బతుకు నిలువునా నీరైపోయినట్టయింది. దానికేం సమాధానం చెప్పను? నేనూ అలాగే అనుకొన్నానంటే అది మరింత కుళ్లి యేడుస్తుంది! ఏమీతోచక అట్టే ఆలోచనలో పడ్డాను—

'ఛీ వూరుకో' మని కసిరి కూర్చోబెట్టగల తాహతుకూడా లేకపోయింది నాకా సమయంలో.

అదెందువల్లనో తరువాత గ్రహించుకొన్నాను. బహుశః అంతకుముందునించే నేను అనుకుంటూవున్న మాట ఇప్పుడది బయట పెట్టడంతో వెన్ను ఝల్లుమన్నట్టయింది, తల దిమ్మెక్కినట్టయింది. అందుకనే మాటలకోసం వెతుక్కోవలసిన గతి పట్టింది నాకు.

వోక్రమానికి రాధ అన్నది: "చచ్చినా సరే నే నాయన్తో కాపరం చెయ్యను" అని—అక్కణ్ణించి లేచిపోయింది. కళ్ళెట్టుకు చూస్తూ వూరుకున్నాను నేను—ఇక నే నప్పుడు చెప్పగల్గిందీ, చేయగలిగిందీ యేమున్నదో నన్ను పుట్టించిన బ్రహ్మదేవుడికే తెలియాలి!

నా అధోగతి బ్రతుకులో యెన్ని వొడుదుడుకులు వచ్చినా దేనిని చూపెట్టుకుని అవన్నీ మర్చిపోయానో, దేనిమీద నా పంచప్రాణాలూ పెట్టుకు బ్రతుకుతున్నానో అదే యీమాట అని దులపరించుకుపోతే నా అవస్థ అప్పుడెలా వుంటుందీ?—

ఇన్నాళ్ళూ నేను పడ్డ పాట్లన్నీ, చేసిన ఖర్చులన్నీ, చెప్పించిన చదువులన్నీ యెందుకు చేశాననుకోను? దీనివల్ల యెవరు బాగుపడ్డారని సంతోషపడను?

అసలే అయినవాళ్లలో తలెత్తుకు తిరగడానికి మొహం చెల్లక చస్తుంటే గోరుచుట్టుమీద రోకటిపోటులా యీ అపకీర్తి కూడా బుజాన వేసుకుని యెన్నాళ్ళని నా బ్రతుకీడవగలను?

ఈ విధమైన బుద్ధి పుట్టనేకూడదు—ఒకవేళ యెవరివల్లనైనా విన్నా, అది అవునా? కాదా? అని ఆలోచించుకుని ఓక్రమాలకి తమాయించుకోవడానికి అవకాశం వుంటుంది, తరవాత నిజం తెలుసుకుమసులుకోవచ్చును. అదంతా యేనాటి సంగతి? ఎప్పుడు ఆలోచించాల్సినదీ—

ఇదేదీ కాకుండా దాని పుర్రెలోనే పుట్టిన యీ బుద్ధిని అణచిపెట్టించి తగినట్టు నచ్చజెప్పగల తాహతు యెవ్వరికున్నది?—యెన్ని విధాల ఆలోచిం

చినా నాకు దరీ, అంతూ తోచలేదు. దాని నెలా పలకరించాలా? అని నాలో నేనే మథనపడుతున్న సమయంలో అదే తిరిగివచ్చింది నాదగ్గరకు—అన్నది కదా!

"మాశావా? రోజూ గదితలుపు గొళ్లెంపెట్టుకు వెళ్లేవారు, యీనాడు తాళంవేసుకుపోయారు?" అని—

దీనిమూలాన కూడా దాని అనుమానం మరింత బలపడిందన్నమాట!

ఇలాటి సున్నితమైన విషయాలలో పొటమరించిన అనుమానం యెక్కడ ఏమాత్రపు అవకాశం దొరికినా బలపడుతుందేకాని మరొకతీరున అర్థం చేసుకొందామన్నా శక్యంకాదు. అటువంటిస్థితిలోకి పోయిన మనసును తిరిగి మన ప్రపంచంలోకి మళ్ళించుకురావాలంటే యెవరికి సాధ్యమౌతుందీ? అందులోనూ నావంటి పిరికిపందకి, మనోవ్యాకులంతో పడియేడ్చేదానికీనా? అయినా ఆభారమంతా నామీదనే వేశాడు భగవంతుడు!—

కోయినామాత్ర మింగినట్టు కడుపులో తిప్పటం మొదలెట్టింది నాకు—ఏది యేమైనా తల్లి ప్రాణం కనక, అదంతా తమాయించుకుని, ప్రాణాలు ఉగ్గబట్టుకుని దానిని చీవాట్లు వెయ్యాలనే ఉద్దేశంతో యిలా అన్నాను—"ఛీ నోరుముయ్! నీ కెంతతోస్తే అంతా నిజమేననుకుని మాట్లాడటమా? లోకులు ఏమనుకుంటారు? అసలు మనబతుకే అంతంతమాత్రంగా వున్నప్పుడు ఈ అభాండాలన్నీ నెత్తిన వేసుకుని యెలా బ్రతిగ్గలం? అరిటాకు వెళ్ళి ముల్లుమీద వాలినా, ముల్లువచ్చి ఆకుమీదపడ్డా అరిటాకుకే ముప్పు. చివరికి మనగతీ అంతే అవుతుంది. కాలుజారితే తీసుకోగలం కాని నోరుజారితే తీసుకోవడం మనశక్యమా?— పెదవి దాటితే పృథివి దాటుతుందంటారు!"—అని నయానా భయానా నాలుగు కేకలేశాను—"ఏవిఁటి అనుకునేది? నేనన్నది అబద్ధమా మేవిఁటి?" అని మొరాయించింది రాధ.

"అబద్ధంగానీ నిబద్ధిగానీ మనలో మనం మథనపడడంవేరు, నోరుచేసుకు మాటలనుకోవడంవేరూను. నిజమైతే నీవొక్కదానికేనా నాకు మాత్రం తలవంపులు కాదూ"అన్నాను నేను ఆభిజాత్యం కాపాడుకొనే వైఖరిలో—

"నీకేంకాదు. అయితే అలా యెందుకు మాట్లాడతావులే" అన్నది రాధ దెప్పిపొడుపుగా—

'అప్పుడు దానిమన సెలా వుంటుంది' అనే సంగతి మీకే వదిలేస్తాను. కనీసం నేను కన్నతల్లిననే గౌరవమైనా వుంచిందా? వినండి తరువాత ఏమన్నదో...అన్నదికదా అని 'నీకర్మం నీదే' అని వదిలి వూరుకోగలనా? నా కడుపుతీపి అందుకు వొప్పుకుంటుందా?—అది అన్నమాట ఇది—"నువు మొదణ్ణించీ యింతే. ఏదో గతిమాలినట్టు ముక్కూ మొహం తెలియని యెవర్నో తీసుకొచ్చి కొంపలో అట్టేపెట్టుకుంటే యేమౌతుంది మరి? అష్టమైనవాళ్లకీ అలుసుఇస్తే నెత్తినెక్కి పిండి కొడతారు. నాకేమీ సంబంధం లేదు. నువ్వే అనుభవించు."అంటూ అక్కణ్ణించి, చివాల్న లేచిపోయింది రాధ—చేసేదేవీఁ లేదన్నట్లు. నేను కళ్లప్పగించి వూరుకొన్నాను—

ఇక్కడే ఇంకొక మాటకూడా అంటాను. ఇదంతా పాలపొంగులా తెచ్చిపెట్టుకొన్న ఆవేశమే గాని, నిజంగా జీవితాన్ని లోతుగా తరచి అర్థం చేసుకొన్నదా రాధ? అంటే లేదనే అనాలి. కాని దానిలో కొన్ని శక్తులుమాత్రం విజృంభించినయ్యని ఖచ్చితంగా అనుకోవచ్చును. లోకం తీరు సమగ్రంగా తెలుసుకోక ఎవరో అనుకున్నట్లు తనూ ఆదారినే నడవాలనే ఆవేశం తప్ప మరొకటి లేదనేఅంటాను. అందుకనే దాని ప్రవర్తనను గూర్చిన యుక్తాయుక్తాలను అంతగా విచారించలేకపోయిందేమో...—

కన్నతల్లిపై గౌరవం చూపలేదనుకుంటూను నేను, కాని ఆంతరంగిక విషయాలంటూ వచ్చేసరికి యెంతటివారినైనా యిలాగే తృణీకరించగలరనేది కూడా నిజం కాకపోదని తోచింది నాకప్పుడు—

కాని అనవసరంగా కోపగించడంగాని చీవాట్లుపెట్టడం కాని దానిని చక్కదిద్దడానికి ఉపాయాలు కావనుకొన్నాను. ఇటువంటి గడ్డుపరిస్థితులు దాపురించినప్పుడు అవతలి వాళ్లెంతవరకూ రెచ్చిపోయినా మనం మాత్రం అంతకు పదిరెట్లు తగ్గివున్నప్పుడే కార్యం సానుకూలమవుతుందనుకున్నాను. అందులోనూ నాలాటి దానికి వాళ్ళతోపాటు రెచ్చిపోతే తిరువాత చేయగలిగిందేముంటుంది?

ఏదోవిధాన వాళ్ళసంసారం చక్కజెయ్యాలనే తలంపుతోనే—రాధ తల్లిగానే శక్తివున్నంతవరకూ ప్రయత్నించేశాను; అదే మీకూ చెపుతాను.

నేనక్కణ్ణించి గదిలోకి వెళ్ళేసరికి కిటికీ కమ్మీలు రెండుచేతులా పట్టుకుని రెప్పలార్చకుండా వీధిలోకి చూస్తూ నిల్చున్నది రాధ; రెండు కళ్ళ వెంటా ధారగా వచ్చే కన్నీరుకూడా అద్దుకోవడం లేదు. మధ్య మధ్య ఏదో సంగతి జ్ఞాపకం వచ్చినట్టు కచ్చగా క్రిందపెదవి కొరుకుతూ తల పంకిస్తున్నది. ఆ అవస్థలో వున్న దానిని చూశాక నాకూ కడుపు తరుక్కుపోయింది. ఏదో గుబులుగా పొర్లుకువచ్చింది. చివాల్న ఇవతలికివచ్చి కుమిలి యేడ్చాను. అలాగైతే దానిని మరింత ఉసురుబెట్టినదాని నౌతా నేమో అని నాకు నేనే తమాయించుకున్నాను. ఏడుపు మొహం కనబడకుండా కళ్ళు తుడుచుకుని రాధను మందలిద్దామని గదిలో అడుగుబెట్టాను —

ఈ మందలింపులో నేను తల్లినని, అది నా బిడ్డ అనే భావం మర్చిపోవాలో, లేక మొసణ్ణించీలాగే ఒక్క చెంపపెట్టుతో ఊరుకోబెట్టాలో ఒక నిర్ణయానికంటూ రాలేక కొద్ది క్షణాలపాటు కలవరం చెందాను.

అది అడగబోయే మాటలకు యెలా సమాధానం యివ్వాలి? అనే ఆలోచనలో కొంతకాలం గడచిపోయింది నాకు. ఈవిధమైన బలహీనత, మనోదౌర్బల్యము ఏర్పడడంవల్లనే కాబోలు, నాకంటే అంత చిన్నదయినా రాధ ఎన్నోరెట్లు పెరిగిపోయినట్లనిపించింది. ఒక్క మాటలో చెప్పాలంటే అప్పుడది నా స్థాయిని మొదలంటా కదిలించి పరిక్షించడానికే ఆ అవతారం దాల్చి నిల్చున్నట్లనిపించింది. దీని కింత శక్తి నిచ్చింది నేనేనా? అది నా మాట వినకబోతే చివరకు నా వేలితో నా కంట్లో నే పొడుచుకున్నట్లవుతుంది!

"ఏవేఁ అమ్మాయ్, ఏవిఁటే నువ్వు మరీను? అస లేవిఁటో అజాపజా తెలుసుకోకుండా నీయిష్టం వచ్చినట్లు అనుకోవడం, నోటికి వచ్చినట్లు మాట్లాడుకోవడమూనా? ఏవిఁటిది పిచ్చిదెయ్యంలా నీవేషమూ నువ్వూను?" —అంటూ పైటచెంగుతో రెండు కళ్ళూ అద్దబోయాను. ఒక చేత్తో నన్ను వెనక్కి నెట్టి వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది—

"ఎవరైనా చూస్తే నవ్విపోతారు. అత నింటికి వచ్చే వేళయిందికూడాను. తెలిస్తే ఏమనుకుంటాడు? ఎటు తప్పినా మధ్యను బయటబడేదిమాత్రం మనమే కదా!" అంటూ మరీ దాని సరసగా వెళ్ళి నిల్చుని బుజంమీద చెయివేశాను—

"వొస్తాడు-ఏ మొహం పెట్టుకుని? ఏవీఁ యెరగని నంగనాచి పాపం! మనమే కాదు, మనతోపాటు తనకీ అంతిగతిపడుతుంది. మధ్య నువ్వు నోరు నొక్కుకోవడం యెందుకు? అసలు బండారం తెలిశాక యెన్నాళ్ళూరుకుని చివరకు గొంతు కోసుకుంటాం? అడిగెయ్యి! ఇవ్వాళ ఇంటికి రాగానే అడిగెయ్యి!! తాడో పేడో తేలిపోతుంది" —అంటూ నా చెయి పట్టుకు విదిలించి కొట్టింది రాధ—

"ఆ మాటలు నువ్వు అనుకున్నంత తేలిక కాదే అమ్మాయ్, అయినా మనం యేమని అడుగుదాం సిగ్గువదిలి?" అన్నాను నేను.

"ఎలా గేమిటి నీబొంద, మన కేమని తెలిసిందో అదే అడుగు, —ఒక్కటే మాట, నిజమా? అబద్ధమా? అని—నిజమని తెలిస్తే మన యింట్లోంచి బైటికి నడవమను, జన్మజన్మాలకీ బుద్ధి వస్తుంది." అంటూ కచ్చగా పళ్ళు బిగించి చీరకొంగు మెలిపెడుతూ నా కళ్ళల్లోకి చూస్తూ నిల్చుంది—

"నిజం తెలుసుకోవాలంటే మనమంత తొందర పడకూడదమ్మా, నిలకడమీద గాని ఉన్నదున్నట్టు తెలియదు—నీ వెర్రి అభిప్రాయం గాని అతన్ని మొహాన అడిగి తేమాత్రం నిజం చెపుతాడని నమ్మకమేవిఁటి? కచ్చతో కార్యాలు సానుకూలమవుతయ్యా? నువ్వంత పిచ్చిగా అతన్నిగూర్చి ఆలోచించడానికి ఏమంత ముంచుకొచ్చిందో చెప్పు! ఎవ్వరన్నా రామాట?" అంటూ నాకు తోచిన యేవో కొన్ని సంగతులు ఏకరువు పెట్టాను. ఓ క్రమాలకి అదే అన్నది—

"ఎవరన్నా వచ్చి చెప్పాల్సిన అవసరం మన కేముంది? నాఅంతటగా నాకే తోచింది, నిజం కాదంటావా?" అంటూ నన్ను మరింత నిగ్గదీసింది. కాదని వొప్పించడానికే నే నిన్ని తంటాలు పడుతుంటే పైగా అదే నన్ను ఎదురు ప్రశ్న వేస్తోంది! ఏమాటఅన్నా తంటాయే వచ్చేట్టుంది. నిజమేనని వొప్పుకుంటే కాగుతూవున్న పాలు పొయిలో బోర్లదోసుకున్నట్టేగదా! అందుకని అసలే నోరు నొక్కుకుని ఊరుకోవడానికీ మనసు వొప్పలేదు. ఈమాట అన్నాను మళ్ళా—

"నీఅంతట నీకు తోచినవన్నీ నిజాలనుకోవడం పొరపాటు. అత నలాంటివాడు యెన్నడూ కాడు. ప్రతి వ్యవహారంలోనూ ముభావంగా వూరుకోవడ

మనేది యీనాడేనా? మొదణ్ణించీ అదే వైఖరిగా! ఏదో ఆసరాజూసుకొని దానికే చిలవలూ పలవలు అల్లుకోవడం బుద్ధి తక్కువకాదూ? మరేమిటి? ఈ వొక్క నాటితోనే మనబతుకు తెల్లారిందంటావా? మొదటికే మోసం తెచ్చుకుంటే మనకాలం యెలా వెళ్ళి మారుతుందో చెప్పు! నువ్వేమీ తెలియని నాపవు కాదుగా! ఇదేవన్నా కుళ్ళిన కూరగాయా విసిరి అవతల పారేయడానికి! కసురుకున్నంతమాత్రాన ఏమౌతుంది? ఇదంతా బైటపడితే మన బతుకులు ఎక్కడుంటయ్? ఇన్నాళ్ళూ ఇన్ని తంటాలుపడి, పైకి తీసుకువచ్చిం దెవరికోసం? నువ్వూ అతనూ చిలకా గోరింకల్లా కాపరం చేసుకుంటుంటే చూసి మురుసుకుందామనేనా? ఈజన్మకి నా బ్రతుకు అయిపోయింది. మిమ్మల్ని చూపెట్టుకుని కాదూ మనిషిలా తిరుగుతున్నాను? లేనిపోని అనుమానాలన్నీ పెంచుకుని నా కడుపులో చిచ్చుపెడతావా?" అంటూ కచ్చగా అరిచేశాను—

నా చేతులు రెండూ రాధ బుజాలమీదవున్నయ్. 'ఏమి మాట్లాడవ్?' అంటూ దానిని కదిలించాను బలంగా. నా మొహంలోకే చూస్తూ దిగాలుగా ఉండిపోయింది రాధ. దాని కళ్లవెంట బొటబొటా నీళ్ళు కారినై. అవి ధారలు కట్టినకొలదీ నా గుండెలు చల్లబడసాగినై. అప్పుడు నాకు మతి చలించినా నల్లరాయిలా నిలబడిపోయాను. బిడ్డ అన్యాయంగా ఏడుస్తున్నదే, అన్న దయా, దాక్షిణ్యాలు నాలో ఏకోశానా లేవాక్షణంలో.

ఏమైనా సరే నా పంతం నెగ్గించుకోవాలనే కచ్చతో చండీరూపం దాల్చి దానియెదట నిలబడ్డాను. బహుశః నాలోని మాతృభావం మరుగుబడిపోయుంటుందప్పుడు. నా వంట్లోని జీవనాడులన్నీ ఒకే వొక వెర్రి ఆవేశంతో నిండిపోయినై—అది రాధను వొప్పించాలనే—ఆత్మాభిమానం మినహా మరోటి కాదు.

ఆ సన్నివేశం సంగతి తల్చుకుంటే ఇప్పటికీ నాకు గగుర్పాటు కలుగుతూవుంటుంది. కేవలం నా స్వార్థంకోసమే ఇంత సాహసానికి ఒడిగట్టానా?—

కొన్ని సంగతులు వాటంతట అవే మన ప్రేరేపణ ఏమీలేకుండానే జరిగిపోతూ వుంటయ్. అలాటి వాటికి ఇదమిత్థమని కారణాలు నిరూపించడం సులభసాధ్యం కాదు. మరికొన్నిటిని వెనకాముందూ ఆలోచించి కాని మొదలుపెట్టం. అలాటి వాట్లవిషయంలో మనకు యిష్టంవచ్చినట్లు సర్దుబాటు చేసుకోవడానికి అవకాశం వుంటుంది. వాట్లవల్ల అంత ప్రమాదమూ సంభవించదు—

మరిప్పుడు రాధకు కలిగిన అనుమానాలకు కారణాలేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నించేకంటే దానిలో పొటమరించిన ఆ బలహీనతను నిర్మూలించాలనే నా పట్టుదల. నిజానిజాలు తర్వాత తేల్చుకోవచ్చును. అవేవో నేనే నిర్ణయించాలి. రాధ యెదటనే విచారణకు పూనుకుంటే వొకప్పుడు నిజమే బయటపడవచ్చు. అప్పుడది నాకు స్వాధీనమవుతుందా? నన్నెదిరించి మరి యెలాటి అఘాయిత్యానికైనా దిగవచ్చు! నేనంత అవకాశం దానికెందుకిస్తాను? ఇటి తరుణంలో నాలోనించి పైకుబికి వచ్చిన స్వార్థం స్వరూపమేమిటో యెవ్వరికీ అర్థం కాదు. నాలాటి తల్లులెవరైనా వూహించుకోగల్గుతారేమో...

అప్పుడు గోడఅద్దంలో కనిపించిన నా స్వరూపం తల్చుకుంటే నాకే భయం వేస్తుంది. రాధ అంతటితో పిల్లిలా అయిపోయింది. నా పంతమే నెగ్గింది—

కొంతసేపలావుండి "అయితే యేంజెయ్యమంటావ్?" అ నడిగింది రాధ—

నా కచ్చ తగ్గుముఖం పట్టలేదన్నాను కదూ, మొదట మాట్లాడినంత ఊతంగానూ అన్నాను; 'నోరు మూసుకుని, నేను చెప్పింది విని, చచ్చినట్టు పడివుండు,' అని—

అయితే రాధను గురించి మొదట్లో నాకున్న అనుమానాలు, సందేహాలు ఇప్పుడు నిర్మూలమైనయ్. కసిరికొడితే అదెట్లా మారుతుందోనని మొదట భయపడిన మాట వాస్తవమే—ఇప్పుడు రాధలో మరికొంత శైశవం కూడా గూడుకట్టుకుని వున్నదని దాని ప్రవర్తనవలన నేను అర్థం చేసుకొన్నాను. ఈ పరిస్థితిలో కసిరినా దానివలన కలిగే దుష్ఫలితం యేమీ వుండదనే తోచింది నాకు—

రాధ మరేమీ మాట్లాడక, అక్కడే గోడకు చేరగిలబడి కూర్చుంది. నేనూ అక్కడే వున్నాను. కొంతసేపైన తరువాత, "అతను యింటికి వచ్చే వేళయింది. ఏమిటే పిచ్చివేషం నువ్వూను." అని ఓర్పుగా పలికి తలదువ్వి జెడవేసి నా పనిమీద వెళ్ళిపోయాను.

ఆనాడు అలా గడిచిందగ్గర్నించీ రాధలో కొంతమార్పు కనబడింది. నేను చెప్పిన మాటను నమ్ముకునేది, పొద్దస్తమానమూ నావెంటనే తిరుగుతుండేది.

రాముం వైఖరి మామూలుగానే వుంటుంది. ఒకనాడు అన్నానికి వచ్చీ రాకా, ఒకవేళ వచ్చినా, వేళ తప్పించుతూ వుండేవాడు. కాని అతని విషయమై రాధయెదట నేనేమీ అనుకోనేదానను కాదు. అయినా నేను ఒంటరిగా వున్నప్పుడు వీళ్ళని గురించిన ఆలోచనలతో నే సతమతమవుతూ వుండేదానిని. మొదటనే చెప్పినట్లు నాలో కలిగిన అనుమానం అలా వుండిపోయింది. రాధనైతే నాలుగు కసిరి వూరుకోబెట్టగలిగాను, మరి నాలో పొంగుతున్న హాలాహలాన్ని ఆపగల శక్తి యెవ్వరికున్నదీ—నాకు నేనే సంబాళించుకొని సమాధానపడాలి—

ఏది ఏమైనా వీళ్ళిద్దరూ యిలా విడివిడిగా వుంటున్నంత కాలమూ యివాళ కాకపోతే రేపైనా నిన్నటి అనుమానమే పొటమరించవచ్చు. ఈ తడవ మాత్రం నేను కాదుకదా, నన్ను పుట్టించిన బ్రహ్మ దిగివచ్చినా దానిని సముదాయించడం సాధ్యం కాదు. అందుకని యేదో విధాన వాళ్ళ యిద్దరినీ యేకం చెయ్యాలి, దాని వలన కొంత చక్కబడుతుందనుకున్నాను. ప్రయత్నాలు సాగించాను—

ఇంతలోనే పిట్టపిడుగులా అతనికి ఉద్యోగం రావడం మా యింట్లోనించి వెళ్ళిపోవడం జరిగినై—

తరువాతి సంగతి మా రాధే చెపుతుంది:—

## 3

## రాధ చెప్పింది :

మా అమ్మ చెప్పినదంతా నిజమే: నాగురించి ఆవిడ జీవితంలో యెంతగానో బాధలు పడింది. అయినా ఆవిడలోని ఆవేదనలు, ఆవేశాలు అప్పట్లో నాకంతగా అర్థమయ్యేవి కావు. అంత లోతుగా ఆలోచించుకోలేకపొయ్యేదానిని. మరి కొన్నాళ్ళకు గాని యథార్థం యేమిటో నాకు తెలియలేదు.

నా జీవితం వొకతీరానికి చేరుకోలేదనే మా అమ్మ నన్నుజూసి బాధపడుతూ వుండేదని తెలుసుకున్నాకనే యథార్థం యేమిటో అర్థం చేసుకుందామనే తీవ్రకాంక్ష నాలో రేకెత్తింది; ఆ క్షణంలోనే నే నొక నిర్ణయానికి వచ్చేశాను—కాగలకార్యాన్ని సజావుగా చక్కబెట్టుకుపోవాలన్న తలంపుతో నేనెట్టి ఆవేశానికి గాని, ఆందోళనకు గాని గురికాలేదు. అనవసరమైన ద్వేషాన్ని పెంచుకుని మతి చెతిగొట్టుకోలేదు. నేను చేసిన ప్రతిపనీ మా అమ్మ సలహాపైనే చేశాను.

నా భావిగతి నాలోచించి మాఅమ్మ చెప్పిన సలహా వొకటే వొకటి—అది యిప్పటికీ నాలో వొక విమర్శను కలిగించుతూనే వుంటుంది. అది యిది——"నీ జీవితాన్ని సరిద్దుకోవడమంటే పూర్తిగా తెగిన తంతువును ముడిపెట్టడంవంటిది కాదు; అది తెగుతుందేమో ననుకొనే అనుమానాన్ని మాత్రమే నిర్మూలించుకోవాలి, అని—ఆమాటపై నే నెంతో కాలం ఆధారపడివున్నాను. నా సాధనలో సాఫల్యం కోసం నిరీక్షించాను.

మా అమ్మ చెప్పింది అప్పట్లో నిజమే అయింది. పరిస్థితి అంతకంటే చెయిదాటిపోలేదు—

నిజానికి మా అమ్మ నాకు చెప్పింది వొక సలహా వంటిది కానేకాదు; బిడ్డలయెడల తల్లి నెరవేర్చుకో వలసిన కర్తవ్యం మాత్రమే. సమాన స్థాయిలో వున్న ఇద్దరిమధ్య జరిగే పరిశీలన మాత్రమే సలహా అనబడుతుంది. గాని, మా అమ్మకూ నాకూ మధ్య సంప్రదింపులూ, సలహాలు ఏవిటి? తల్చుకుంటే నా కిప్పుడు నవ్వు వస్తుంది. విచారం వేస్తుంది. అదంతా మా అమ్మనుగురించే.

కాస్త గ్రాహికం తెలిసినవాళ్లకు ఏదైనా చెప్పి వొప్పించడం కష్టం. చెప్పింది చెప్పినట్లుగా వినరు, పైగా ప్రతిదానికీ మొరాయిస్తారు. అప్పట్లో జీవితానుభవం తక్కువ కావడంవల్ల నేనూ ఆ పనే చేశాను. తర్వాత నన్ను నేనే తమాయించుకుని సాధనామార్గం ఆలోచించాను—

మా అమ్మ చెప్పినట్లు ఆయన మా యింట్లో వున్నప్పటికంటే వుద్యోగం దొరికి మరొకచోట అడుగు పెట్టగానే మానసికంగా దూరమైనట్టే తోచింది నాకు. దానికితోడు యేదోవిధాన ఆయన్ను సన్నిహితుణ్ణిగా చేసుకోవాలనుకుంటున్న దినాలలోనే యీ సంఘటన తోసుకురావడం నాకెంతో బాధ కలిగించింది.

నాలో యెన్ని అనుమానాలు, కావేషాలు పెరిగినా, అన్నీ అణిచివేసుకున్నాను. 'ఎదటి వ్యక్తిని సరిగా అర్థం చేసుకోవాలనుకుంటే ముందు మన హృదయం నిష్కల్మషంగా వున్ననాడే అది

సాధ్యమవుతుంద'ని మా అమ్మ చెప్పిన మాటనే కొంగున ముడివేసుకొన్నాను—అయితే ఆ వ్యక్తి మాయెదుట లేనప్పుడు, ప్రత్యక్షంగా మాట్లాడగల అవకాశం సన్నగిలినప్పుడు గత్యంతరం మరేముంది? ఏదోవిధాన ఆయన యెదటబడి తెగించి నాహృదయం విప్పిచెప్పగల సాహసం, చనువూ లేవాయె.

ఇన్నాళ్ళనించీ ఆయన మాయింట్లో మెలగుతున్నా అచ్ఛంగా కొత్తవ్యక్తిగానే కనబడుతూ వుండేవారు నాకు. ఏదో క్షణాన చూపులతో పలకరించడం మినహాగా నాకాయనతో మాటాడగల తెగింపు కలగలేదు. ఆయనా అంతకంటే ముందడుగు వెయ్యలేదు — ఈ వొక్క సంగతే మా జీవితంలో సుదీర్ఘకాలం కమ్ముకుపోయింది. నేనిప్పుడు ఇవన్నీ యేకరువు పెడుతుంటే ఒక శతాబ్దంపాటు వెనక్కు నడచిపోతున్నట్లే వుంటుంది. నాగరక జీవితానికి అలవాటుపడ్డ యే యువతీ యువకులూ, సన్నిహితులై వుండికూడా మాలాటి యాంత్రికజీవితం గడిపి వుండరు. నాలోని స్త్రీత్వంగానీ, ఆయనలోని పౌరుషంగానీ, లేదా మా యిద్దరిలోని మానవత్వం— ఇలా మరగున పడి వుండిపోవడానికి కారణంయేమిటో నేనిప్పుడు వివరించి చెప్పదామనుకోవడంలేదు—

బహుశః దీనినే మరొకతీరుగా వ్యాఖ్యానించుకోవచ్చు కొందరు. నియమము, నిబంధన—మొదలైన పెద్దపెద్ద మాటలతో. కాని జీవితంలో ఆ రెంటికీ గలస్థానము, విలువ యేపాటివో నేనింకా నిర్ణయించుకోలేక పోతున్నాను—

నేనిప్పుడు ఈక్షణంలో మనిషిని. గత జీవితంలోని ఆశలు, నిరాశలు, ఆవేదనలు, ఆందోళనలు అన్నీ జ్ఞాపకానికి తెచ్చుకోవాలంటే కాలానికి కళ్లెం వెయ్యడంవంటిదే నని నిర్ధారించుకోవచ్చును. దానికి నేను సిద్ధమయే వున్నాను. అప్పటి అనుభవాలను ఇప్పటి జీవితంతో జోడించుకోకుండా వుండలేను. అప్పట్లో నాలో కలిగిన కొన్నిభావాలకు నా మూర్ఖత్వమే, నాలో గూడుకట్టుకొని వున్న శైశవమే కారణమంటాను. తరువాత కలిగిన ఫలితం మాట అటుంచి ఇప్పటికీ అప్పటికీ నా స్వభావంలో జ్ఞానంలో పెద్దవైపరీత్యం కనబడుతుంది.

మాఅభిప్రాయం ఆయనకు తెలియజెయ్యాలంటే ఏంజెయ్యాలి, అని ముందర మాలో మేము తర్కించుకుని చివరకు అవలంబించిన క్రమమైన విధానం యిది. దీనివలన యెవరి కెట్టి మనోవైకల్యమూ కలగదని, మేమిద్దరమూ వొక నిర్ణయానికి వచ్చాము. సంప్రదాయము అనే వొక పెద్దమాటకు కట్టుబడి మేమీ తీరున చెయ్యవలసి వచ్చింది. ఒకరు పాటించిన సంప్రదాయంలోను, మర్యాదల్లోను మరొకరి కెప్పుడు గౌరవభావము, గణ్యతా లేకపోయినవో, ఆ వ్యవహారం అప్పుడే నెరవేరదనుకోండి! అచ్ఛంగా నావిషయంలోనూ అంతే జరిగింది—

మా మామగారు — కొమయ్యగారు — ఆయన నిజంగా సత్యకాలం మనిషి. ఏవిధమైన రహస్యాలు, కృత్రిమపు టాలోచనలు, మనసులో దాచుకోలేని వ్యక్తి. మా మనసులో అభిప్రాయం ఆయనకు వ్రాయించి వారిద్వారా కొడుక్కు చెప్పి వొప్పించాలని మా అమ్మకు ఆశ. ఇంతకు పూర్వం మాలో కలిగిన విపరీత భావాలు ఊహల సంగతి అటుంచి, భవిష్యత్తునుగురించి మాత్రమే ఆయనతో సంప్రదింపులు-

నేనందుకు కాదనలేదు. అనుకున్నది అనుకున్నట్లు మా అమ్మ వ్రాయించింది—నాల్గవరోజు కల్లా ఆయనదగ్గిర్నుంచి వచ్చిన సమాధానం యిది—

తనకొడుక్కు ఉద్యోగమై మా యింట్లోనించి వెళ్ళిపోయిన రోజులలోనే ఆయన కొక ఉత్తరం వ్రాశారుట! అందులో—'తన మనసులో యేదో తుపాను రేగిందట, దాని విసురువల్లనే కొట్టుకుపోయి మరొకచోట పడిపోయారట—తిరిగి రావడం అసాధ్యమట—పైగా తన విషయంలో తండ్రి ధేమాత్రమూ జోక్యం కల్గించుకొనే అవకాశమే లేదట-తనకు తాను స్వతంత్రులయారట—మా దగ్గిర్నుంచి యేవిధమైన జాబు వచ్చినా అవన్నీ తనకు పంపమని ఉత్తరువు చేశారట—మేము వ్రాసిన యిప్పటి ఉత్తరం కొడుక్కు పంపుతున్నారట—ఇదీ—కొమయ్య మామగారు వ్రాసిన సమాధానం.

వెంటనే మాకొక సంతృప్తి కలిగింది. మేము విస్పష్టంగా వ్రాసిపంపిన అభిప్రాయాలన్నీ ఆయన చేతికి అందినవి కదా; అని—మా మామగారి అమాయికత్వానికి యేమనాలో తోచలేదు.

మరికొన్నాళ్ళపాటు నిరీక్షించినా ఆయన దగ్గిర్నుంచి మాకెల్లాటి సమాధానమూ అందలేదు. అంతమాత్రానికే ఆయన ఆదుర్దాపడిపోతారని మేమూ అనుకోలేదుగా. కాని నాకొక విషయం మాత్రం ఆశ్చర్యం గొలుపుతూ వుంటుంది. 'మొదణ్ణించీ క్రమబద్ధమైన జీవితం గడపిన వ్యక్తికూడా కొన్నాళ్ళకు

తనకు తానే దూరమైపోవడానికి కారణం యేమై వుంటుందీ' అని—బహుశా అలాటివాళ్ళంతా ఆత్మస్వాతంత్ర్యాన్ని కోల్పోతారేమో అనిపిస్తూ వుంటుంది. ఇతరులు ఏ మాటలు చెబితే వాట్లనే సిద్ధాంతాలుగా పరిగణించుకొనేవారి ఆత్మస్వాతంత్ర్యం యేపాటిదో నా కర్థం కావడంలేదు. నాకు మల్లేనే ఆయనకూ ఆలోచనాశక్తి లోపించిందనుకుంటాను. లేకపోతే యింతగా అలిగివెళ్ళి ఆందోళన పరుపవలసిన అగత్యం యేమీ లేదు. ఇవన్నీ నేనుమాత్రమే నిర్ణయించుకుంటే సరిపోయిందా? ఆయనచేత వొప్పించవద్దూ మరి? అందుకే నా భగీరథ ప్రయత్నమంతాను—

కామయ్యగారి సమాధానం చూశాక తిరిగీ ఆయనకు వ్రాసినా లాభంలేదనే నిశ్చయానికి వచ్చాము. మరొకరిద్వారా నా రాయబారాలు కొనసాగించుదామన్నా అదెలాగూ నెరవేరేది కాదని మా అమ్మకూ తోచింది. ఆవిడ అన్నమాట అల్లా ఇదే—'అతను పూర్వపువాడైతే మనం చెప్పినా మరి వొకరిచేత చెప్పించినా, యిబ్బంది వుండేదికాదు, కాని, బొత్తుగా మనపొడ గిట్టకుండా దూరానపోయి వున్నవాడికి, యిందులో మరొకరినికూడా యిరికిస్తే వొక అందానరాదు. ఏమైనా సరే మనలో మనమే గుబ్బిసలాడాలి, అని— నేనూ సరే, అన్నాను.

ముందుగా మా అమ్మ ఒక ఉత్తరం వ్రాయించిందాయనకు. అందులోని సంగతులు నే ననుకొంటున్నవే. నాతో యెంతటి వోర్పుగాను, నిదానంగాను వ్యవహరించుకూ వచ్చిందో ఉత్తరంకూడా అలాగే వ్రాయించింది. నా విషయమై యెలావున్నా—తల్లికీ బిడ్డకూ మధ్య తేడాయేముంది? మే మిద్దరం హృదయాలు విప్పుకొని మాట్లాడుకోగలం. కాని, పరాయి వ్యక్తికి రాసేటప్పుడు, గుంభనయేమిటో, ఆభిజాత్యం యేమిటో బొత్తుగా అడుగంటిపోయినట్లు ఉన్నదున్నట్లు వెళ్ళగక్కేయడం మొదట నాకే చిరాకు కలిగించింది. కాని ఆవిడయెదట నోరు నొక్కుకున్నాను—

మొదటినించీ మా అమ్మకు వొకటే దిగులు, మగదిక్కులేని యీ సంసారం యెలా తుద నెగ్గుతుందీ? అని. ఆ కొరతను తీర్చుకోడానికి, ఆవిడ పడినపాట్లు, పెట్టుకున్న ఆశలు—అవన్నీ ఉత్తరంలో విపులంగా బతిమాలుకుంటున్న ధోరణిలో వ్రాయించింది. ఉన్నట్లుండి హఠాత్తుగా యిలా విస్తరి చింపుకు వెళ్లిపోవడంతో ఆవిడ జీవితాశ యెలా భగ్నమయిందో-మానసికంగా కోలుకోలేని పరిస్థితికి వచ్చి యెలా దిగులుతో దించుకుపోతున్నదో వివరించి వ్రాయించింది. భవిష్యత్తులో వొకే వొక ఆశతో ఆమె తన జీవితాన్ని వెళ్లదీసుకొంటున్నది, యెన్నటికైనా మే మిద్దరమూ ఒకటై మా సంసారం చక్కబడుతుందేమో, అని—

చివరకు అడిగిందొకటే—ఆయనగారు అలిగి వెళ్లిపోవడానికి తాను చేసిన తెలివితక్కువపని యేదైనా వుంటే యెదటికి వచ్చి చెప్పమని, దానిని సవరించుకోడానికి తాను సిద్ధమయ్యేవున్నానని—.

వీట్లకు సమాధానం ఆయన వాళ్ళ నాన్నకు వ్రాసిన ఉత్తరాలలో కనబడుతున్నా మా అమ్మకు నమ్మకంలేదు. ఆవిడ అనుకొన్న దొకటీ, ఆయన వూహించింది మరొకటీను-ఏదియెలా సక్రమమార్గంలో నడిపించుకుపోదామనుకున్నా అన్నిటికీ పెడర్థాలు తీసి అడ్డదారులు తొక్కారు ఆయన — అందుకని యెదటికి వచ్చినప్పుడు నచ్చజెప్పి తన వూహాలలో గల వాస్తవమేమిటో ఆయనకు అర్థమయ్యేలా చెయ్యాలని మా అమ్మకు పట్టుదల. అందుకనే అలా వ్రాయించింది—అంతటితో ఆ వుత్తరం ముగించి పంపించింది—

నేను మొదటనే చెప్పినట్లు వొకరు పాటించిన సంప్రదాయాలు, మర్యాదలు యెదటి వ్యక్తికికూడా గణ్యతకు రానపుడు యెవరెంత మంచి మార్గంలో పోయినా పెడదారి పట్టిస్తూ వుంటారని,— ఇప్పుడు సరిగా అదే జరిగింది—ఫలితం. మా అమ్మ వ్రాయించిన ఉత్తరానికి ఆయన బదులు వ్రాయలేదు— మేమింత బతిమాలి వ్రాసినా, ఆయన ఉదాసీనంగా వూరుకొనడానికి కారణం మా కర్థం కాలేదు. అంత కచ్చగా వుంటే యెదటికి వచ్చి అటూ యిటూ తేల్చుకు వెళ్లిపోవడం పౌరుష మనిపించుకుంటుంది కాని, చాటునవుండి మమ్మల్ని యేడిపించడమెందుకూ? ఇందువల్ల మాలో రేకెత్తిన దురూహాలన్నీ నిజాలై సాక్షీగా సాగిపోవలసిన జీవితాలకు ఉరిత్రాళ్లు కావడంమాత్రం తథ్యం—ఉన్నదానిని మరుగు పర్చుకుని ఆత్మవంచన చేసుకున్నందువలన కలిగే లాభమేమిటో...—

తనకు గలిగిన నష్టాన్ని లెక్కగట్టుకోక యెదటివాళ్లెంతవరకు అణగారి పోతున్నారా అని పొంచి కూర్చునే సంకుచిత మనస్తత్వం కొందరికి నరనరా

ల్లోనూ జీర్ణించి వుంటుంది. వారి జీవితాలకు అదివొక సాధన. అందులో సఫలులైతే వారికి పట్టపగ్గాలుండవు. తమ దౌష్ట్యాన్నంతా కప్పిపుచ్చుకోగల ఒక్క విషపు నవ్వుతో జీవితం చాటుకుపోయి కన్నంలో యెలకలా చీకటి తిని బ్రతుకుతూ వుంటారు—

ఆక్షణంలో ఆయన్నుగురించి ఆలోచిస్తున్నప్పుడు అచ్ఛంగా నాకీ ఆలోచనలే తోచినై. కాని మరొకసారి నామీద నాకే యేవగింపు కలిగింది. హద్దూ పద్దూ లేక ఆలోచిస్తున్నానాఅనిపించింది—

నాలాగే ఆయనా కొత్తగా జీవితంలో అడుగు పెడుతున్న వ్యక్తి. ఇంతటి దురాలోచన ఆయనలో గూడుకట్టుకొని వుండగల అనుభవమూ, అవకాశమూ కూడా శూన్యమే. మరేవిటి యీ మొరటుతనానికి కారణం?

మానుంచి తను దూరమైపోతే లోకందృష్టిలో మేము గడ్డిపరకలం. ఏ గాలి యెటు విసిరితే అటల్లా యెగిరిపోతాం, ఏ మురికికూపంలోనో పడి కంపెత్తి నామరూపాలులేక కాలగర్భంలో లయించిపోతాం. లేదా లోకం మమ్మల్ని యమయాతనలు పెడుతుంది; మామీద ఆంక్షలు విధిస్తుంది. అనరాని మాటలంటుంది—మమ్మల్ని మానవత్వంలేని మురికి జీవాలుగా జమకట్టేస్తుంది—" ఇంత భయంకరమైన ఆలోచనలతోనే ఆయన మమ్మల్ని దూరానికి నెట్టేశారనుకోవడంలో తప్పేముంది? ఇది సాధ్యమా? సంభవమా? అని ప్రశ్నించుకోవడంలో నాకేవీ ఔచిత్యం కనబడలేదు. చివరకు ఒకే వొక సమాధానం చెప్పుకుని సంతృప్తిపడ్డాను—

“ప్రపంచం పెరిగింది. అంటే అనేక తరహాల మనుషులు పుట్టి పెద్దవాళ్ళౌతున్నారు. వారినిబట్టే వారి స్వభావాలూ మారుతున్నై—ఒకప్పుడు న్యాయమైనది మరొకనాటికి మరొక వ్యక్తి ఉద్దేశ్యం ప్రకారం అన్యాయం, అక్రమం—అవుతుంది. ఒకప్పటి మంచితనం మరొకనాటికి మోసంగా పరిణమించుతుంది—విశ్వాసాలు, నమ్మకాలు సమయానుకూలంగా వ్యక్తుల విలువలనుబట్టి వారి ప్రవర్తనల ఉచ్చనీచాలనుబట్టి నిర్ణయింపబడుతూవుంటయ్—ఎంతటి అమానుషమైనా అసంభవం మాత్రం కాదు” అని అప్పుడు నాలో పొటమరించిన వొక భావానికి నేనిప్పుడు వ్యాఖ్యానం చెప్పుకుంటున్నాను. కనక నాగురించి నా ప్రవర్తనను గురించి యిష్టంవచ్చిన నిర్ణయాలు చేసుకోగలశక్తి, స్వాతంత్ర్యము నాకూ వున్నయ్. కాని అవి యిప్పుడు హద్దుదాటి విజృంభించితే ఆయనలా నేనూ నాకు దూరమైపోవలసిన గతి పడుతుందేమో—

అనుకున్ననాటికి ఆశించిన సమాధానం అందకపోయేసరికి కొన్నాళ్ళపాటు—అంటే నాలుగైదు రోజులపాటు—మా అమ్మ బొత్తిగా ఉదాసీనంగా వుండిపోయింది. నోరువిప్పి సరిగా నాతో మాట్లాడేదే కాదు. ఏదైనా అడిగితే అవును, కాదు, అని మాత్రమే ముక్తసరిగా సమాధానా లిస్తూవుండేది. కొన్నికొన్ని విషయాలు అవసరాన్నిబట్టి ఆవిడకు నేనే జ్ఞాపకం చెయ్యాల్సివచ్చేది—

ఆవిడ మౌనం నన్ను మరింత భయపెట్టింది. కాని తరవాత అర్థమయింది నాకు, యీ నాలుగు రోజులూ ఆవిడ లోలోన యెంత గుండెకోతగా కుమిలి కృశించిపోయిందో... ఈ స్వల్పవ్యవధిలోనే పాతికేళ్ల పెద్దతనం పైనబడినట్లయింది మా అమ్మకు. దీనికంతకూ కారణం నేను. ఆవిడను సముదాయించడం మాత్రం నాకు సాధ్యమా?—

ఒకరోజున ఏదో పనివున్నట్లు నన్ను పిల్చింది మా అమ్మ. అదే తడవుగా నేనువెళ్లి ఆవిడ ఒడిలో వొరిగిపోయాను. నా నుదుటిమీది జుట్టు పైకితోస్తూ యెంతసేపో నా మొహంలోకి దీక్షగా చూసింది. ఆవిడ కళ్ళవెంట కారిన వెచ్చని కన్నీరు నా గుండెల మీద కాలువలు కట్టింది. మేమిద్దరం అలా యెంతో సేపు నిశ్శబ్దంగా వుండిపోయాము. ఇన్నాళ్లుగా ఆవిడ గుండెల్లో గూడుకట్టుకుని కుముల్చుతున్న వేడి కన్నీరు సాంతం చల్లారినట్టయింది—. అమ్మాయీ, ఇటుచూడు, అన్నది మా అమ్మ. నేను వెర్రిగా ఆవిడ మొహంలోకి చూశాను. ఇలా చెప్పుకుపోయిందావిడ—“మనమేం జేస్తాం? యెవరు తీసుకున్న గోతిలో వాళ్లే పడతారు. ఎక్కడి కక్కడ పెడదారులు తొక్కుతూ పశువులా ప్రవర్తించుతుంటే మధ్య వెక్కిరింత పాలయేది మనమూ యేవిటి? నాకేమంతఖర్మం పట్టలేదు. ఎంతవరకూ లొంగాలో అంతవరకూ లొంగాను. ఇంకెన్నాళ్ళని యీయన గారికి వంగి సలాములు చెయ్యడం?—లోకానికి వెరిచే నేనీమాత్రమైనా వ్యవహారం నడిపాను. మరేం ఫరవాలేదు. మగదిక్కెవరూ లేరుకదా అని భయపడాల్సిన అవసరం నాకేంలేదు. పద రేపే రామేశ్వరం పోదాం:—అన్నది—.

ఆవిడ గొంతు మారగానే నాలో వొక విధమైన వణుకు బయల్దేరింది. మా అమ్మ అక్కణ్ణించి లేచి పోతూవుంటే చరాల్న ఆవిడ మెడ కావిలేసుకున్నాను. అంతకంటే ఆ సమయంలో నాకు వేరు ఉపాయం తోచలేదు—పెదిమలు పొడారిపోయినయ్. వో క్రమాలకి వెక్కి వెక్కి యేడవడం మొదలుపెట్టాను—నన్ను జూసి కసురుకుంటున్న ధోరణిలో యిలా అన్నది మా అమ్మ.

“ఏడుస్తా వెందుకే పిచ్చిమొద్దా? మన చేతనైనదంతా చేశాము. తిన్న విశ్వాసంకూడా లేక అతనలా వ్యవహరించాడు ఇంతకంటే కుక్కలు నయం.” అంటూ నన్ను విదిలించి కొట్టి లేచి పోబోయింది. నేను మెడ వదలలేదు. మరింత బిగ్గరగా యేడుస్తూ వొళ్ళు తెలియకుండా యిలా అనేశాను—‘తొందరపడమాకే అమ్మా, నేనూ వొక ఉత్తరం రాసి చూస్తానే” అని—

ఎందుకనో దెబ్బతిన్న దానిలా కళ్ళువిప్పి నా మొహంలోకి చూసింది మా అమ్మ. వెంటనే ఇలా అన్నది ‘సరే నీ యిష్టం అలాగే చేసుకో’ అని—అక్కణ్ణించి చివాల్న లేచిపోయింది—ఆ క్షణం నించే నా జీవితంలో మరొక ఘట్టం ప్రారంభమయింది—

బహుశః మా అమ్మకూడా అదే అనుకొని వుంటుంది. ‘తాను విధిగా చేయవలసిన ప్రయత్నంలో పొరపాటున వొకటి మిగిలిపోయివుంటుంది, అది నా ద్వారా కొనసాగించి కొంతకు కొంత ఫలితం చేజిక్కించుకోవచ్చు, అని—

అయితే నే నిప్పుడొక వుత్తరం వ్రాయాలి. ఎవ్వరికో కాదు, నా భర్తకే. ఆయన నన్ను విడిచి దూరాన వున్నారు. ఆయనకు నామీద విశ్వాసము, అభిమానము, అన్నిటికంటే మిన్నయైన ప్రేమ—వున్నయ్యాని యెలా నిర్ణయించుకోవడం? నాయడల ఆయన ప్రవర్తనను బట్టి కొంతకు కొంత వూహించుకుందామనుకున్నా తగిన ఆధారాలు కనిపించడం లేదు. ఈ కలాపాలలో ఇంతకు పూర్వం నాకుగల అనుభవం శూన్యమాయె! అందులోనూ యిలాటి క్లిష్టమైన ఘట్టాలు దాపురించినప్పుడు యేమాత్రం తప్పటడుగు వేసినా అది జీవిత ఫలకంమీదకు యెల్లకాలమూ దాని క్రీనీడను కమ్ముకొస్తూనే వుంటుంది—అన్నీ నిజాలే. కాని చెయదగిన దొక్కటే నాకు కనబడలేదు. ఈ విషయమై మా అమ్మ అవలంబించిన ముభావం నన్ను మరింత కలవరపెట్టింది—

ఏమైనా యిక మిగిలిపోయిన కర్తవ్యం వొక్కటే. అది—ఆశానిరాశలను సమానం చేసుకొని ఫలితాన్ని శంకించక, సాహసించి ఆయనకు వుత్తరం వ్రాయడం. ఈ నిర్ణయంతో మళ్ళీ మొదటికే వచ్చాను—

ఉత్తరం వ్రాయ మొదలెట్టాను. నాలో యేవో కొన్ని భావాలు పొంగి పొరలినై. ఒళ్లంతా గగుర్పొడిచినట్లయింది. ఏదో తెలియని ఆవేశం, ఆవేదన—కాని నాలోని వుద్వేగాన్నంతా వెళ్ళగక్కగల సాధనం లేదు.

కొందరు భార్యలు భర్తలకు వుత్తరాలు వ్రాశారనే సంగతి చదివాను. కాని, నా అంతట నేను మొదలుపెట్టడం యిదే ప్రథమం. నా కలం ముందుకు నడవలేదు. కాని వ్రాయక తప్పని స్థితి—

ఒకవంక సాహసం, మరొక చెంప భవిష్యత్తు తల్చుకుంటే కలిగిన ఆందోళన—ఇవన్నీ కలిసి నాకు కంపాన్ని పుట్టించినయ్. ఒకొక్కప్పుడు, అమ్మయ్యో, అని వెన్ను ఝల్లుమనిపించేది—ఇవన్నీ తట్టుకుని నేనా లేఖను పూర్తిచేయడానికి నాలుగురోజులు పట్టింది.

ఉత్తరం కొంచెం పెద్దదే అయింది. అయితే ఏమి? నాహృదయం కొంతవరకైనా విప్పి చెప్పగలిగాను—కొన్ని తావులలో నాకుకూడా ఆశ్చర్యం గొలిపే ఘట్టాలు వ్రాశాను. నిజంగా నాలోనూ ఇంత ప్రేమ వున్నదా? అనిపించింది. అయితే యిన్నాళ్ళనుంచీ యెందుకు బయటపడలేదు? తగిన సంఘర్షణ జరిగిననాడే యధార్థరూపం వ్యక్తమవుతుంది కాబోలు...కాని అది లక్ష్యం తెలియని బాణంలా యెటూ రివ్వుమని పోకుండా కొంత సాధనతో మరికొంత నేర్పుతో మంచిఫలితాన్ని అందించేందుకు యెలా పరిణమించాలో నాకప్పటికంతగా తెలియదు—

నా ఉత్తరం సాంతం చదివాక, ‘అలాగా’ అన్నట్టు తల పంకించి తిరిగి నాకిచ్చివేసింది మాఅమ్మ. నేను దానిని పోస్టు చేశాను.

అనుకున్ననాటికి సమాధానం రానే వచ్చింది. అది నాపేరునే వచ్చింది—అదంతా నేను వ్రాసిన

ఉత్తరానికి సమాధానం మాత్రమే, మాఅమ్మ ప్రసక్తి అందులో లేనేలేదు.

అయినా మా అమ్మ ఆనందానికి మేరలేదు. నన్ను కావిలించుకుని ముద్దు పెట్టుకుంది. పసిపాపనులా లాలించింది. వెనక నేనావిడలో కనబడుతూ వున్న దన్న పాతికేళ్ళ ముసలితనం వొక్కక్షణంలో యిట్టే మాయమయింది. దానితో పాటు ఆవిడలో కనబడుతూ వచ్చిన భయంకరాకారమూ అంతరించింది. ఒక్క మాటలో చెప్పాలంటే మా అమ్మ మామూలు మనిషయిందన్న మాట—

నాకొచ్చిన ఉత్తరంలో ఆయన ముక్తసరిగా వ్రాసిన సమాధానం యిది—'నీ వుత్తరం సాంతం చదువుకున్నాక నాకూ అలాగే తోచింది. సంసార జీవితం సాగించడానికి నా కేలాటి అభ్యంతరమూ లేదు. అయితే నాకు నేను స్వతంత్రుణ్ణి. ఒకరి చెప్పు చేతలకు లోబడి నడుచుకునేవాడను కాను. నేనొక రింట్లో వుండను. నువు వెంటనే నాతో వచ్చెయ్యాలి. లేదా అమ్మను కనిపెట్టుకు కూర్చోవాలనుకుంటే నీ యిష్టం వచ్చినంతకాలం వుండొచ్చు. అన్నింటికీ అంగీకరిస్తే నేనూ సిద్ధమే—

సమాధానం చూస్తే ఆయన వట్టి మొరటుమనిషి అని యెవ్వరైనా అనుకుంటారు. కాని మా అమ్మ ఆ మాత్రానికే కొండెక్కింది. చివరకు పెదవి విరిచి యీ మాటమాత్రం అనుకున్నది నాకు వినబడీ వినబడని ధోరణిలో 'ఇన్నాళ్ళనించీ చేసినా చివరికి నాచేత యెందుకూ కొరగాకుండాపోయింది' అని.

ఆయన వ్రాసిన ఉత్తరానికి నూటికి నూరు పాళ్ళు వొడబడుతున్నట్లుగా మా అమ్మయిష్టంతో నే సమాధానం వ్రాశాను.

ఏదో నిర్ణయించిన రోజుకు ఆయనా దిగారు. అంతా అతి సాదాగా ముక్తసరిగా జరిగిపోయింది—

ఇక్కడకు వస్తూవున్న రెండు మూడు రోజులూ, ఆయనకు ముళ్ళమీద ఉన్నట్లేవుండేది. తరవాత ఆయనతో పాటు నేనూ కాపరానికి వెళ్ళిపోయాను. మరి కొన్నాళ్ళకు మా అమ్మ రామేశ్వర యాత్ర కంటూ బయల్దేరింది. ఇంతటితో నాజీవితం వొక తీరానికి చేరిందికదా, అనుకున్నాను!

